


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి | శనివారం 07 ఆగస్టు 2021 | సంపుటి : 03 | సంచిక :05 | పేజీలు : 4 | వెల : రూ 3-00


## నూతన విద్యా విధానానికి ఏపీ కేబినెట్ ఆమోదం



హైదరాబాద్, ఆగస్టు 6, (న్యూస్ పల్స్)ఏపీ సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో మంత్రివర్గ సమావేశం ముగిసింది. పలు కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. నవరత్నాల పథకాల అమలు, జగనన్న విద్యాకానుక, నాడు–నేడు, శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లు, ఫౌండేషన్ స్కూళ్లు, ఫౌండేషన్ ప్లస్ స్కూళ్ల ఏర్పాటుపై కేబినెట్‌లో చర్చించారు. ఈ నెల 10న అమలు చేయనున్న వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకంపై కూడా చర్చించారు. పులిచింతల ప్రాజెక్ట్ గేటు విరిగిన అంశంపై కేబినెట్‌లో చర్చించారు. 20 నిముషాల పాటు స్టాప్ లాక్ గేటు, హైడ్రాలిక్ గేట్ల ఏర్పాటుపై సమావేశంలో చర్చ జరిగింది. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నాడు–నేడు కింద స్కూళ్లను సౌకర్యవంతంగా తీర్చిదిద్దామని మంత్రి పేర్నినాని అన్నారు. రాష్ట్రంలో 34 వేలకు పైగా ప్రాథమిక పాఠశాలలు అభివృద్ధి చేశామని, మెరుగైన విద్య అందించాలన్నదే సీఎం జగన్ ఆకాంక్షని పేర్కొన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పేర్ని నాని మీడియాకు వెల్లడించారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. " ఏ తరగతికైనా తెలుగు తప్పనిసరి సబ్జెక్ట్‌గా ఉంటుంది. ప్రాథమిక దశలోనే మంచి విద్య అందించేలా విప్లవాత్మక చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రంలో కొత్తగా 6,22,856 మంది విద్యార్థులు ఎన్‌రోల్ చేసుకున్నారు. నూతన విద్యావిధానంలో స్కూళ్లను 6 రకాలుగా వర్గీకరించాం.

కేబినెట్ కీలక నిర్ణయాలు ఇవే?

నూతన విద్యావిధానం ప్రకారం స్కూళ్లను 6 రకాలుగా వర్గీకరణ ఖరారుతి. శాటిలైట్ స్కూల్స్ ( పీపీ?1, పీపీ?2)
ఫౌండేషన్ స్కూల్స్ (పీపీ?1, పీపీ?2, 1, 2)
. ఫౌండేషన్ ప్లస్ స్కూల్స్ ( పీపీ?1 నుంచి 5వ వరగతి వరకూ)
ప్రీ హైస్కూల్స్ ( 3 నుంచి 7లేదా 8వ తరగతి వరకూ)
హైస్కూల్స్ ( 3 నుంచి 10వ తరగతి వరకూ )
హైస్కూల్ ప్లస్ (3వ తరగతి నుంచి 12వ తరగతి వరకూ)
విద్యార్థులకు ప్రాథమిక దశలోనే మంచి విద్య అందించేలా విప్లవాత్మక చర్యలు
ఏ తరగతికి అయినా తెలుగు తప్పనిసరిగా ఉంటుంది
రాష్ట్రంలో కొత్తగా 4,800 తరగతి గదుల నిర్మాణం
నేతన్న నేస్తానికి 200 కోట్ల రూపాయలు కేటాయింపు
ఆగస్టు 10న 3వ విడుత నేతన్న నేస్తం
20 వేల లోపు అగ్రిగోల్డ్ డిపాజిట్‌దారులకు ఈనెల 24న చెల్లింపులు
ఈ నెల 14న విద్యాకానుక పంపిణీ
అభ్యంతరం లేని భూముల్లో ఆక్రమణల క్రమబద్ధీకరణకు ఆమోదం
రాజమహేంద్రవరం అర్బర్ డెవలప్‌మెంట్ అథారటీ ఏర్పాటు
ఇకపై కాకినాడ డెవలప్‌మెంట్ అథారటీగా గోదావరి అర్బన్ డెవలప్ అథారటీ

## టెన్త్ మార్కుల మెమోలు విడుదల




అమరావతి : ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ శుక్రవారం టెన్త్ మార్కుల మెమోలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేడ్లు కావాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారని, హైపవర్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా.. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా గ్రేడ్లు కేటాయించామని తెలిపారు. రెండు విద్యాసంవత్సరాలకు సంబంధించి గ్రేడ్లు ప్రకటించామన్నారు. ఏ విద్యార్థికీ నష్టం కలగకుండా చర్యలు తీసుకున్నామని, భవిష్యత్‌లో విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. కాగా, గ్రేడ్ల విధానంలో విద్యార్థుల ఉత్తీర్ణతను ప్రకటించారు. 2019?20 విద్యార్థులు రాసిన మూడు ఫార్మేటివ్ పరీక్షల మార్కులకు 50 శాతం వెయిటేజీ, ఒక సమ్మేటివ్ పరీక్ష మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇచ్చారు. మొత్తం 100 మార్కులుగా పరిగణనలోకి తీసుకుని గ్రేడ్ ఇచ్చారు. అన్ని సబ్జెక్టులకు ఇదే విధానం అనుసరించారు. వొకేషనల్ కోర్సుల విద్యార్థులకు కూడా ఇదే విధానం. 2017, 2018, 2019 సంవత్సరాల్లో ఫెయిలై ఆ తరువాత పరీక్షలకు హాజరైనవారికి వారి ఇంటర్నల్ మార్కులను పరిగణనలోకి తీసుకున్నారు. 20 అంతర్గత మార్కులను 5తో రెట్టింపుచేసి 100 మార్కులుగా పరిగణించి గ్రేడ్ ఇచ్చారు.

## కరోనా మూడో తరంగం నివారణలో రాష్ట్రం దిక్సూచి కావాలి

### ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్



విజయవాడ, ఆగస్టు 6 కరోనా మూడవ తరంగం రాకుండా నిరోధించడంలో ఆంధ్రప్రదేశ్ ఇతరులకు దిక్సూచిగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మాననీయ బిశ్వభూషణ్ హరిచందన్ ఆకాంక్షించారు. కరోనా తొలి, మలి విడతలలో పలు స్వచ్ఛంధ సంస్థలు అద్భుతంగా పని చేశాయని అదే క్రమంలో మూడో తరంగాన్ని ఎదుర్కోవటంలో తమదైన పాత్రకు సిద్ధంగా ఉండాలని సూచించారు. విజయవాడ రాజ్ భవన్ లో మూడో తరంగ నివారణపై అవగాహన -స్వచ్ఛంధ సంస్థల పాత్ర అన్న అంశంపై శుక్రవారం ప్రత్యేక వెబినార్ నిర్వహించారు. ఈక్రమంలో స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులను ఉద్దేశించి గవర్నర్ పలు సూచనలు చేస్తూ టీకాలు పొందని వ్యక్తులను చైతన్యవంతం చేయాలని, అందుబాటులో ఉన్న వనరులను సక్రమంగా వినియోగించాలని సూచించారు. మొదటి, రెండవ తరంగం అనుభవాలతో ప్రభుత్వం ఆరోగ్య మౌలిక సదుపాయాలను పెంపొందిస్తూ వెంటిలేటర్లు, హాస్పిటల్ బెడ్‌లు, పిపిఇ కిట్‌లు మొదలైన వాటిని పూర్తి స్థాయిలో సమీకరిస్తుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వేగవంతమైన వ్యాక్సినేషన్ డ్రైవ్ కారణంగా అనేక మంది ప్రాణాలు రక్షించబడ్డాయన్నారు. కొత్త తరంగం వచ్చిన ప్రతిసారి మనం ఎదుర్కోవలసిన సమస్యలు విభిన్నంగా ఉంటున్నాయని, మాస్క్ ధరించడం, సామాజిక దూరం పాటించడం చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవటం వంటివి మూడవ తరంగ నివారణలో సహాయపడతాయని గౌరవ హరిచందన్ అన్నారు. సామాజిక, మతపరమైన సమావేశాలు వద్దని, జనసమూహాలతో కలిసేటప్పుడు ప్రజలు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొత్త పోకడలతో అభివృద్ధి చెందుతున్న కరోనా మునుపటి కంటే వేగవంతమైన వ్యాప్తిని కలిగి ఉందని నిపుణులు చెబుతున్నారని గుర్తు చేసారు. కరోనా వచ్చినప్పటికీ టీకా ద్వారా ఆసుపత్రి పాలవకుండా కాపాడుకోగలమన్నారు.

ప్రారంభోపన్యాసం చేసిన గవర్నర్ వారి కార్యదర్శి, రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షులు ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ కరోనా కారణంగా సమాజం మునుపెన్నడూ చూడని ఆందోళనకరమైన పరిస్థితిని ఎదుర్కుంటుందన్నారు. అసంఘటిత రంగంలోని ప్రజలు, పేదలు మహమ్మారి కారణంగా ఎక్కువగా ప్రభావితమయ్యారని ఆందోళన వ్యక్తం చేసారు. ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్ హోమంగళగిరి) డైరెక్టర్ డాక్టర్ ముఖేష్ త్రిపాఠి మాట్లాడుతూ కరోనా తొలి, మలి విడతల వ్యాప్తి వల్ల దాని నివారణలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రజలు తెలుసుకున్నారన్నారు. సామాజిక సమావేశాలకు దూరంగా ప్రజానీకం ఉండాలని, వస్త్ర ముఖ ముసుగులు కరోనా సంక్రమణ విషయంలో తక్కువ రక్షణను అందిస్తాయని, సాధ్యమైనంత వరకు ఎన్95 మాస్క్ లు వాడాలని సూచించారు.

## ఏపీలో కొత్తగా 2,209 కరోనా కేసులు..

అమరావతి: ఆంధ్రప్రదేశ్ లో కరోనా ఉధృతి కొనసాగుతుంది. గడిచిన 24 గంటల్లో ఏపీలో 81,505 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 2,209 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. గత 24 గంటలలో కరోనా బారిన వడి 22 మంది మృత్యువాతపడ్డారు.

దీంతో మొత్తం మరణాల సంఖ్య 13,490 కు చేరింది. గడిచిన 24 గంటల్లో 1,896 మంది కోవిడ్ నుంచి కోలుకుని క్షేమంగా డిశ్చార్జ్ అవ్వగా, ఇప్పటివరకు 19,44,267 మంది ఏపీలో డిశ్చార్జ్ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ శుక్రవారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ఏపీలో ప్రస్తుతం 20,593 కరోనా కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. దీంతో రాష్ట్రంలో పాజిటివ్ కేసుల సంఖ్య 19,78,350 కు చేరింది. ఏపీలో ఇప్పటి వరకు 2,50,27,770 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

## పి.వి.సింధుకు రూ.30 లక్షల నగదు పురస్కారం అందించిన ఏపీ సీఎం జగన్.

### విజయవాడ దుర్గమ్మను దర్శించుకున్న స్టార్ షట్లర్ అనంతరం సీఎం జగన్‌తో భేటీ

### త్వరలో విశాఖ అకాడమీలో శిక్షణ ఇస్తా: పీవీ సింధు



విజయవాడ: ఒలింపిక్ పతక విజేత, భారత స్టార్ షట్లర్ పీవీ సింధు విజయవాడ కనక దుర్గమ్మను దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు సింధుకు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు ఆమెకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఒలింపిక్స్‌కు వెళ్లేముందు దుర్గమ్మను దర్శించుకున్నానని.. అమ్మవారి ఆశీస్సులతో పతకం గెలిచానన్నారు. దుర్గమ్మ దర్శనానికి రావడం సంతోషంగా ఉందని చెప్పారు. 2024 ఒలింపిక్స్ సహా భవిష్యత్తులో మరిన్ని టోర్నమెంట్లు ఆడాల్సి ఉందన్నారు.

ఏపీ ప్రభుత్వం చర్యలు సంతోషదాయకం

దుర్గమ్మ దర్శనం అనంతరం ఏపీ సీఎం జగన్‌ను పీవీ సింధు కలిశారు. ఒలింపిక్స్‌లో పతకం సాధించిన సింధును సీఎం అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సింధును జగన్ సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఒలింపిక్స్‌లో సాధించిన పతకాన్ని సీఎంకు సింధు చూపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఒలింపిక్స్‌కు వెళ్లేముందు పతకంతో తిరిగి రావాలని సీఎం ప్రోత్సహించారని తెలిపారు. క్రీడాకారుల ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సంతోషదాయకమని చెప్పారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో మరిన్ని పతకాల సాధనకు అవకాశం కలుగుతుందన్నారు. విశాఖలో తన అకాడమీ నిర్మాణానికి ప్రభుత్వం భూమి కేటాయించిందని.. త్వరలోనే ఏర్పాట్లు పూర్తి చేసి క్రీడాకారులకు శిక్షణ ఇస్తానని సింధు చెప్పారు. ప్రభుత్వం తరఫున సింధుకు రూ.30 లక్షల చెక్కును అధికారులు అమెకు అందించారు.



## నిర్మలా సీతారామన్ విశాఖ పర్యటన..

# ఎయిర్ పోర్ట్ వద్ద హై అలర్ట్

విశాఖ పట్నం: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ విశాఖ పర్యటన నేపథ్యంలో ఎయిర్ పోర్ట్ దగ్గర హై అలెర్ట్ ప్రకటించారు. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకారణకు వ్యతిరేకంగా ఆర్థిక మంత్రికి వినతులు సమర్పించాలని జేఏసీ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎయిర్ పోర్ట్ దగ్గరకు వందల సంఖ్యలో కార్మికులు వస్తారని పోలీసులకు ముందస్తు సమాచారం అందటంతో విమానాశ్రయం దగ్గర హై అలర్ట్ ప్రకటించడమే కాక భారీ ఎత్తున బలగాలను మోహరించారు. ఎయిర్ పోర్ట్‌కు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత అనుమతిస్తున్నారు. నిర్మలా సీతారామన్ పర్యటన నేపథ్యంలో మీడియా డీఎస్ఎన్‌జీలను ఎయిర్ పోర్ట్ లోకి వెళ్ళేందుకు అనుమతి నిరాకరించారు. విశాఖ ఎయిర్‌పోర్ట్ వద్ద స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల ఆందోళనకు దిగారు. విశాఖ పర్యటనకు వచ్చిన నిర్మలాసీతారామన్‌కు.. వినతిపత్రం ఇచ్చేందుకు జేఏసీ నాయకులు విమానాశ్రయం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జేఏసీ నాయకుల ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



## పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నాం: పేర్నినాని

అమరావతి: నాడు– నేడు కార్యక్రమం కింద పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నామని ఏపీ మంత్రి పేర్ని నాని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 34 వేలకు పైగా పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర మంత్రివర్గ భేటీ వివరాలను మంత్రి నాని మీడియాకు వివరించారు. తొలివిడతగా 15 వేలకుపైగా పాఠశాలలను అభివృద్ధి చేశామని, బడుల్లో దశల వారీ పనులకు రూ.21 వేల కోట్లు చెల్లించేందుకు కేబినెట్ అంగీకారం తెలిపిందని అన్నారు. 34 వేల బడుల్లో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యాబోధన జరుగుతోందన్నారు. అమరావతి: నాడు– నేడు కార్యక్రమం కింద పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నామని ఏపీ మంత్రి పేర్ని నాని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 34 వేలకు పైగా పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర మంత్రివర్గ భేటీ వివరాలను మంత్రి నాని మీడియాకు వివరించారు. తొలివిడతగా 15 వేలకుపైగా



పాఠశాలలను అభివృద్ధి చేశామని, బడుల్లో దశల వారీ పనులకు రూ.21 వేల కోట్లు చెల్లించేందుకు కేబినెట్ అంగీకారం తెలిపిందని అన్నారు. 34 వేల బడుల్లో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యాబోధన జరుగుతోందన్నారు. నాణ్యమైన విద్యా బోధనపై ప్రభుత్వం సర్వే నిర్వహించిందని, చాలా ప్రాథమిక పాఠశాలల్లో ఇప్పటి వరకు ఒకరిద్దరు ఉపాధ్యాయులే బోధిస్తున్నారని చెప్పారు. అందరికీ ఒకే టీచర్ ఉండటం వల్ల పిల్లలకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. ప్రాథమిక దశలోనే మంచి చదువు అందేలా విప్లవాత్మక చర్యలు చేపట్టామని, తెలుగు, ఆంగ్లంలో ఒకేసారి బోధన జరిగేలా చర్యలు చేపట్టిన ఏకైక రాష్ట్రం ఏపీ అని మంత్రి వివరించారు. నాణ్యమైన విద్యా బోధనపై ప్రభుత్వం సర్వే నిర్వహించిందని, చాలా ప్రాథమిక పాఠశాలల్లో ఇప్పటి వరకు ఒకరిద్దరు ఉపాధ్యాయులే బోధిస్తున్నారని చెప్పారు. అందరికీ ఒకే టీచర్ ఉండటం వల్ల పిల్లలకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. ప్రాథమిక దశలోనే మంచి చదువు అందేలా విప్లవాత్మక చర్యలు చేపట్టామని, తెలుగు, ఆంగ్లంలో ఒకేసారి బోధన జరిగేలా చర్యలు చేపట్టిన ఏకైక రాష్ట్రం ఏపీ అని మంత్రి వివరించారు.

## దర్యాప్తు సంస్థల తీరుపై సీజేఐ సంచలన వ్యాఖ్యలు..!

న్యూఢిల్లీ: దేశంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) సహా వివిధ దర్యాప్తు సంస్థల తీరుపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ) జస్టిస్ ఎన్వీ రమణ సంచలన వ్యాఖ్యలు చేశారు. జార్ఖండ్ రాష్ట్రంలో ధన్‌బాద్ అడిషనల్ సెషన్స్ జడ్జి ఉత్తమ్ ఆనంద్ హత్య కేసును సుప్రీంకోర్టుగా సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ కేసు విచారణ సందర్భంగా సీజేఐ ఎన్వీ రమణ.. దర్యాప్తు సంస్థల తీరును తప్పుపట్టారు. తమకు ప్రాణహాని ఉందంటూ న్యాయమూర్తులు ఫిర్యాదు చేసినా సీబీఐ సహా వివిధ దర్యాప్తు సంస్థలు స్పందిచడం లేదని, వారికి ఏమాత్రం సాయపడటం లేదని సీజేఐ విమర్శించారు. సీబీఐ తన తీరు మార్చుకోవడం లేదు. న్యాయమూర్తులు తమకు బెదిరింపులు వస్తున్నాయంటూ సీబీఐకి, ఐబీకి ఫిర్యాదు చేస్తే వారు సరిగా స్పందించడం లేదు. కనీసం వారికి ఎలాంటి సాయం కూడా అందించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ అంశంపై మాట్లాడాల్సిన బాధ్యత నాపై ఉన్నది అని సీజేఐ వ్యాఖ్యానించారు. అదేవిధంగా జడ్జి హత్య కేసుకు సంబంధించి పోలీసులు సమర్పించిన చార్జిషీట్‌పై కూడా సీజేఐ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చార్జిషీట్‌లో బలమైన సాక్ష్యాలను నమోదు చేయలేదని విమర్శించారు. పోలీసులు చార్జిషీట్ రూపొందించిన తీరుపై తనకు అనుమానం కలుగుతుందని పేర్కొన్నారు. నిందితులకు బెయిల్ లభించేందుకు వీలుపడేలా చార్జిషీట్ రూపొందించినట్లుగా అనిపిస్తుందన్నారు. గత నెల 28న జార్ఖండ్‌లో ధన్‌బాద్ అడిషనల్ సెషన్స్ జడ్జి ఉత్తమ్ ఆనంద్ దారుణహత్యకు గురయ్యారు.

# సంపాదకీయం

శనివారం 07 ఆగస్టు 2021

## పాపం.. చిరాగ్ పాశ్వన్...

దివంగత రాజ్యసభ సభ్యుడు, లోక్ జనశక్తి (ఎల్ జే పీ) అధినేత రామ్ విలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్ రాజకీయంగా ఒంటరయ్యారు. రాజకీయంగా కష్టకాలంలో ఉన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు, మళ్లీ పూర్వవైభవం సాధించేందుకు జనంలోకి వెళ్లాలని చిరాగ్ పాశ్వాన్ నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా ప్రజల్లో తనకు, తన కుటుంబానికి గల పట్టును నిరూపించుకునేందుకు 'జన్ ఆశ్వీరాద్' యాత్రను చిరాగ్ పాశ్వాన్ ప్రారంభించారు. తన తండ్రి జన్మదినమైన జులై 5న దీనికి శ్రీకారం చుట్టారు. దివంగత నేత సొంత నియోజకవర్గమైన హాజీపూర్ నుంచి ఈ యాత్రను ప్రారంభించారు.హాజీపూర్ నుంచే రామ్ విలాస్ పాశ్వాన్ ఎనిమిది సార్లు లోక్ సభకు ప్రాతినిథ్యం వహించారు. హాజీపూర్ ను రామ్ విలాస్ పాశ్వాన్ తన కర్మభూమిగా పేర్కొనేవారు. ప్రస్తుతం ఈ స్థానం నుంచి పాశ్వాన్ సోదరుడు పశుపతి కుమార్ పాశ్వాన్ ఎంపీగా ఉన్నారు. నరేంద్రమోదీ మంత్రివర్గ విస్తరణలో ఆయన చోటు సంపాదించుకున్నారు. ఆహారశుద్ధి శాఖ మంత్రిగా నియమితులయ్యారు. ప్రస్తుతానికి బాబాయ్ పశుపతి, అబ్బాయ్ చిరాగ్ పాశ్వాన్ రాజకీయంగా బద్ధశత్రువులు. ఒకరి పొడ అంటే మరొకరికి ఎంతమాత్రం గిట్టదు. పార్టీకి గల ఆరుగురు ఎంపీల్లో అయిదుగురు పశుపతి వెంట వెళ్లిపోయారు. అసలైన ఎల్ జే పీ తనదేనని పశుపతి ప్రకటించారు. లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా కూడా పశుపతి నాయకత్వంలోని ఎల్ జే పీ నే అసలైన పార్టీ అని ప్రకటించారు. దీంతో చిరాగ్ పాశ్వాన్ దెబ్బతిన్నారు. చివరికి పశుపతిదే పైచేయి అయినది.ఈ నేపథ్యంలో అన్నివిధాలా ఒంటరైన 38 ఏళ్ల చిరాగ్ పాశ్వాన్ రాజకీయంగా నిలదొక్కుకునేందుకు జనంలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ప్రస్తుతం ఆయన జన్ ఆశ్వీరాద్ యాత్రతో క్షణం తీరిక లేకుండా ఉన్నారు. యాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందన బాగానే ఉంది. తన తండ్రి ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నారని, వారి మద్దతుతోనే రాజకీయాల్లో రాణించారని, తానూ ఆయన బాటలోనే ప్రయాణిస్తున్నానని చిరాగ్ పాశ్వాన్ చెబుతున్నారు. తన బాబాయి పశుపతి కుమార్ పాశ్వాన్ కేంద్ర మంత్రి అయినప్పటికీ, పార్టీకి చెందిన అయిదుగురు ఎంపీలు ఆయన వెంట ఉన్నప్పటికీ ప్రజలు మాత్రం తన వెంటే ఉన్నారని చిరాగ్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజల మద్దతుతో పార్టీకి పూర్వవైభవం తీసుకువ స్తానని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.రామ్ విలాస్ పాశ్వాన్ రెండో భార్య రీనాదేవి కుమారుడైన చిరాగ్ పాశ్వాన్ బీటెక్ పట్టభద్రుడు. ఆయన గతంలో 'మిలే హమ్ ' అనే హిందీ చిత్రంలో కంగనా రంగౌత్ సరసన నటించారు. ఆ చిత్రం అంతగా ప్రజాదరణ పొందలేకపోవడంతో రాజకీయాల్లోకి వచ్చారు. 2014, 2019 ల్లో జముయి నియోజకవర్గం నుంచి లోక్ సభకు ఎన్నికయ్యారు. కొంతకాలం ఓ స్వచ్ఛంద సంస్థ నడిపారు. ఎల్ జే పీ ని చీల్చడంలో, పార్టీని దెబ్బతీయడంలో ముఖ్యమంత్రి నితీశ్ హస్తం ఉందన్నది చిరాగ్ పాశ్వాన్ ఆరోపణ. గత ఏడాది జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో చిరాగ్ పాశ్వాన్ పార్టీ ఒంటరిగా పోటీ చేసింది. ప్రధాని నరేంద్ర మోదీని సమర్థిస్తూనే మరోపక్క నితిశ్ ను వ్యతిరేకించేవారు. అందుకే నాటి ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేశారు. ఎన్డీఏ కూటమిలో భాగంగా ఉన్న తన పార్టీకి నితీశ్ కేవలం 25 సీట్లు కేటాయించడంతో ఒంటరిగా ఎన్నికలకు వెళ్లారు. 135 సీట్లకు పోటీచేసి దాదాపు ఆరు శాతం ఓట్లు సాధించారు. ఒక్క సీటూ గెలవలేకపోయారు. అయితే తాను ఒంటరిగా పోటీ చేయడం ద్వారా నితీశ్ ను నష్టపరిచానని, ఆయన పార్టీ బలాన్ని 43కు పరిమితం చేయగలిగానని చిరాగ్ పాశ్వాన్ చెబుతుంటారు. అందువల్లే ఆయన పార్టీ రెండో స్థానానికి పరిమితమైందని, ఇదే తన బలమని చిరాగ్ పాశ్వాన్ చెబుతుంటారు. పార్టీకి చెందిన అయిదుగురు ఎంపీలు చౌదరి మెహబూబ్ ఆలీ ఖైసర్ (ఖగారియా),చందన్ కుమార్ (నవాడ), వీణాదేవి (వైశాలి), ప్రిన్స్‌రాజ్ (సమస్తిపూర్), పశుపతి కుమార్ పాశ్వాన్ (హాజీపూర్) బయటకు వెళ్లినా పార్టీ బలంగానే ఉందని, ప్రజలు తనవెంటే ఉన్నారని చిరాగ్ పాశ్వాన్ చెబుతున్నారు. సమస్తిపూర్ మాజీ ఉప ప్రధాని, దివంగత నేత బాబూ జగ్జీవన్ రామ్ నియోజకవర్గం. హాజీపూర్ రామ్ విలాస్ నియోజకవర్గం. ఇద్దరూ దళిత నేతలుగా జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు.

## సెల్ఫ్ గోల్ చేసుకుంటున్న అప్పలరాజు

శ్రీకాకుళం, ఆగస్టు 6, (న్యూస్ పల్స్)శ్రీకాకుళం జిల్లాలో గౌతు ఫ్యామిలీకి మంచి చరిత్ర ఉంది. స్వాతంత్ర్య సమరయోధుడు, బీసీ నేత సర్దార్ గౌతు లచ్చన్న బలమైన రాజకీయ వారసత్వం వారి సొంతం. అటువంటి గౌతు ఫ్యామిలీ 2019 ఎన్నికల్లో పలాసా నుంచి పోటీ చేసి ఓడిపోయింది. అంతకు రెండేళ్ల ముందు వరకూ రాజకీయ వాసనలే ఎరుగని ఒక సామాన్య డాక్టర్ సీదరి అప్పలరాజు జగన్ టికెట్ ఇవ్వడంతో ఎమ్మెల్యే అయిపోయారు. అంతే కాదు ఏడాది తిరగకుండా మంత్రి కూడా అయ్యారు. ఆ మీదట ఆయన జోరు చూపిస్తున్నారు. తన ప్రత్యర్థిగా ఉన్న గౌతు ఫ్యామిలీని ఎదుర్కోవడంతో మంత్రి అప్పలరాజు దూకుడుగా ఉన్నారు. అయితే అది కాస్తా ఇపుడు ట్రాక్ తప్పుతోందని అంటున్నారు.పలాసాలో గౌతు శిరీష 2019 ఎన్నికలలో పోటీ చేశారు. ఆమె తండ్రి శ్యామ సుందర శివాజీ రాజకీయాల నుంచి తప్పుకున్నారు. అంతకు ముందు అయిదేళ్ళూ కూడా ఆమె తండ్రి తరఫున నియోజకవర్గంలో చక్రం తిప్పారు. దాని వల్ల వచ్చిన మంచి కంటే చెడు ఎక్కువై ఆమె ఓడారు. దానికి ఆమె భర్త కూడా చాలా వరకూ కారణం. ఇదిలా ఉంటే మంత్రిగా బాధ్యతలు చేపట్టాక అప్పలరాజు గౌతు ఫ్యామిలీని టార్గెట్ చేశారు అంటున్నారు. మొదట లచ్చన్న విగ్రహాన్ని పలాసా జంక్షన్ లో నుంచి తప్పించడానికి చూశారు. దాంతోనే బీసీలకు వ్యతిరేకం అయ్యారు. పార్క్ స్థలం ఆక్రమణలకు గురి అయిందని మంత్రి చెబుతూ లచ్చన్న విగ్రహాన్ని తొలగించపోయారు కానీ అది బెడిసి కొట్టింది. ఆ తరువాత సైలెంట్ అయ్యారు. అక్కడ టీడీపీ పోరాటమే సక్సెస్ అయింది.శిరీష కూడా గతంలో కంటే ఇపుడు స్పీడ్ పెంచారు. ఆమె ఎక్కువగా విశాఖలో ఉంటారు, క్యాడర్ కి అందుబాటులో ఉండరు అన్న విమర్శలకు చెక్ పెడుతూ ఇపుడు మంత్రిని గట్టిగానే ఢీ కొడుతున్నారు. ఈ నేపధ్యంలో సోషల్ మీడియాలో శిరీష మీద అసభ్యకరమైన పోస్టింగులు పెడుతున్నారన్నది రాజకీయ దుమారాన్నే రేపుతోంది. ఆమె మహిళ. పైగా ప్రముఖ కుటుంబానికి చెందిన వారు. ఇక బలమైన టీడీపీ వెనక ఉంది. దీంతో ఇదిపుడు అప్పలరాజును ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మహిళ అని కూడా చూడకుండా అసభ్యకరమైన పోస్టింగులు పెడతారా అంటూ ఎంపీ కింజరాపు రామ్మోహననాయుడు గట్టిగానే నిలదీస్తున్నారు. శిరీష కూడా దీని మీద ఆవేదన వ్యక్తం చేస్తూ వైసీపీది దిగజారుడు రాజకీయం అంటున్నారు.మంత్రి అప్పలరాజు గౌతు ఫ్యామిలీని రాజకీయంగా గెలవాలి కానీ ఇలాగనా అంటూ అపుడే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి ఈ విషయంలో మంత్రి అప్పలరాజుకి సంబంధం లేకపోయినా అనుచరులు ఎవరైనా అతి చేసినా కూడా ఆయనే బాధ్యుడు అవుతారు. పైగా మహిళా సెంటిమెంట్ తో పెట్టుకుంటే చిత్తు కావడం కూడా ఖాయమే. ఇపుడిపుడే మంత్రి సర్దుకుంటేనే ఇలాంటి వ్యవహారాలు పునరావృత్తం కాకుండా ఉంటాయని అంటున్నారు. బీసీల దైవంగా ఉన్న లచ్చన్న మనవరాలి విషయంలో ఇలా చేస్తే అది నిప్పుతో చెలగాటమే అవుతుంది అని కూడా అంటున్నారు. మరో వైపు రాజకీయ అనుభవ రాహిత్యంతోనే అప్పలరాజు ఇలా దూకుడు చేస్తున్నారా అన్న ప్రశ్న కూడా వస్తోంది. జగన్ కి సన్నిహితుడిగా, సమర్థుడిగా ముద్రపడిన అప్పలరాజు ఇలాంటి తప్పటడుగులు తమ పార్టీలో ఎవరూ వేయకుండా చూసుకుంటేనే మళ్ళీ మళ్లీ గెలవగలరు అంటున్నారు. మొత్తానికి రాజకీయాలకు అతీతంగా శిరీష విషయంలో మద్దతు దక్కుతోంది. దీని మీద మంత్రి ఏ రకమైన వ్యూహాన్ని అనుసరించి ముందుకు సాగుతారో చూడాలి.

## కొడాలికి సొంత సామాజిక పోరు



విజయవాడ, ఆగస్టు 6, (న్యూస్ పల్స్)జగన్ కి అత్యంత ఇష్టుడిగా పేరు పొందిన మంత్రి కొడాలి నాని. నానికి ఇష్టమైన వ్యక్తులు కొందరు ఉన్నారు. ఎన్టీఆర్ ని అన్నా జగన్ ని ఎవరు విమర్శించినా ఆయన అసలు సహించారు. తనదైన పదజాలంతో దూకుడు చేస్తారు. ఆయన చెప్పేది కూడా ఒక్కటే. జగన్ని ఎవరైనా అంటే మాత్రం తాను ఏదీ లెక్కచేయనని, వారు ఎంతటివారు అయినా వదిలేది కూడా లేదని అంటారు. అటువంటి కొడాలి నాని గొంతు కొంతకాలంగా వినిపించకపోవడం విడ్డూరమే. సొంత పార్టీలోనే దీనిమీద చర్చ సాగుతోందిట.మధ్యనే సొంత జిల్లాలో మాజీ మంత్రి దేవినేని ఉమ అరెస్ట్ వ్యవహారం అతి పెద్ద కలకలం రేపింది. అంతకు ముందు అక్రమ మైనింగ్ అంటూ ఉమ తన వారితో కలసి ఆ ప్రాంతాలకు వెళ్ళి హడావుడి చేశారు. ఇదంతా ఏపీని హీటెక్కించింది. అయితే ఇంత జరిగినా కూడా కొడాలి నుంచి పెద్దగా సౌండ్ లేకపోవడమే విశేషంగా చూడాలి. మైలవరం ఎమ్మెల్యే వసంత క్రిష్ణ ప్రసాద్ కౌంటర్ చేశారు కానీ ఆ ఇంపాక్ట్ రాలేదు. మొత్తానికి మొత్తం టీడీపీ ఈ విషయంలో ఒక్కటి అయింది. చంద్రబాబు అయితే దేవినేని ఉమ ఇంటికి వచ్చి మరీ పరామర్శ చేశారు. మరో టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి కమ్మల మీద ఇది దాడి అంటూ మాట్లాడారు. ఇంత జరిగినా కూడా కొడాలి నాని మాత్రం పెద్దగా మాట్లాడింది లేదు.నిజానికి కమ్మ సామాజికవర్గం అంతా టీడీపీతో కలసి లేరు. అలా కనుక ఉంటే గుడివాడలో కొడాలి నాని ఎందుకు గెలుస్తారు. పైగా అది ఎన్టీయార్ పుట్టిన గడ్డ కూడా. అయితే వారంతా కూడా తటస్థంగా ఉండమనే నానికి చెబుతారుట. టీడీపీ మీద ఒంటి కాలుతో కొడాలి నాని పదే పదే లేవడాన్ని కూడా వారు తప్పు పడతారుట. విమర్శలు చేయవచ్చు కానీ చంద్రబాబుని పట్టుకుని వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం మాత్రం వారు వద్దు అనే చెబుతారుట. ఇన్నాళ్ళూ వారి మాటలు వినని కొడాలి నానికి ఇపుడు ఏమైనా కొత్త ఆలోచనలు వస్తున్నాయా అన్న చర్చ కూడా పార్టీలో ఉందిట. టీడీపీ నేత గోరంట్ల అన్నారని కాదు కానీ వైసీపీలో నిజంగా కమ్మలకు అన్యాయం జరుగుతోందా. కొడాలి నాని తప్ప వేరే వారికి మంత్రి పదవి దక్కలేదు. ఇక ఇటీవల నామినేటెడ్ పదవుల జాతర జరిగినా కమ్మలకు సరైన పోస్టులు దక్కలేదు అన్న అసంతృప్తి ఆ సామాజికవర్గంలో ఉందని అంటారు. మరో వైపు చూస్తే ఏపీలో రాజకీయం కూడా కమ్మలు రెడ్లు అన్నట్లుగానే విడిపోయింది. ఈ నేపథ్యం ముంచి చూసుకున్నపుడు కొడాలి నాని ఈ మధ్య కొంత వెనక్కు తగ్గుతున్నారా అన్నదే చర్చట. అయితే ఆయన జగన్ కి అప్తుడు అని వేరే విధంగా ఆలోచించాల్సింది లేదని సర్దిచెప్పేవారూ ఉన్నారు. కానీ ఏపీలో టీడీపీని తిట్టాలి అంటే కొడాలి నాని మాత్రమే కరెక్ట్ అన్నది వైసీపీలో బలంగా ఉండిపోయింది. ఇపుడు అదే కొడాలి నాని నోట మాటలు రాకపోవడంతోనే ఇంత చర్చ సాగుతోంది అంటున్నారు.

## స్టీల్ ప్లాంట్ పై వైసీపీ ప్లాన్..

విశాఖపట్టణం, ఆగస్టు 6, (న్యూస్ పల్స్)ఇప్పటికి రెండు సార్లు అప్రతిహత విజయాలతో దేశంలో అధికారాన్ని చేపట్టిన ఘనత మోడీది. వరసగా మూడవసారి వస్తే కనుక ఆయన ఏకంగా నెహ్రూ రికార్డునే బద్ధలు కొట్టడం ఖాయం. అయితే జాతీయ స్థాయిలో సీన్ చూస్తే అలా లేదు. కానీ మిత్రుల అండతో మళ్ళీ మోడీ వస్తారా అన్న డౌట్లు కూడా అక్కడక్కడ ఉన్నాయి. ఏపీలో రెండు ప్రధాన పార్టీలూ కూడా ఈ అంశాలనే బేరీజు వేసుకుటూ తమదైన రాజకీయాలకు ఎపుడూ పదును పెడుతూంటాయి. అధికార వైసీపీకి ఆ మధ్య దాకా మోడీ మోజు ఉండేది. ఇపుడు అది ఒక్కసారిగా సడలిపోయింది అంటారు.స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో వైసీపీ గట్టిగానే నిలబడినట్లుగా చెప్పుకోవాలి. ఆ పార్టీ మీద టీడీపీ నిందలు వేసినా కూడా తన శక్తిమేరకు వైసీపీ ఈ అంశం మీద పోరాడుతోంది. అన్నింటికీ మించి ఉక్కు కార్మికులు వైసీపీని బాగానే నమ్ముతున్నారు. వారికి కేంద్ర మంత్రుల అపాయింట్మెంట్లు ఇప్పించడంతో పాటు ఢిల్లీ ఉద్యమానికి కూడా పూర్తి మద్దతుగా నిలిచింది. ఇక ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి చేసిన కొన్ని వ్యాఖ్యలు సంచలనం రేకెత్తిస్తున్నాయి. ఎన్నికల దాకా ఉక్కు పోరాటాన్ని కొనసాగిస్తే ప్లాంట్ బతికిపోయినట్లే అన్నట్లుగా ఆయన లేటెస్ట్ కామెంట్స్ చేశారు.కొద్ది నెలలలో ఎటూ 2021 సంవత్సరం ముగుస్తోంది. ఇక మధ్యలో 2022 ఉంది. ఈ ఏడాది అంతా కూడా స్టీల్ ప్లాంట్ ఉద్యమాన్ని కొనసాగిస్తూ మరో వైపు కోర్టుల ద్వారా స్టే తీసుకువచ్చి ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటే కచ్చితంగా విజయం మనదే అని విజయసాయిరెడ్డి వ్యూహం ఒకటి చెప్పారు. 2023 అంటే కచ్చితంగా ఎన్నికల ఏడాదిగా ఉంటుంది. దాంతో ఉక్కుని 2022లో కాపాడుకుంటే ఇక ఎన్నికల వేళ బీజేపీ సర్కార్ ప్రైవేట్ పరం చేసే సాహసానికి ఒడిగట్టదు అని ఆయన అంటున్నారు. మరి ఇందులో కూడా నిజం ఉందిసరే 2024 ఎన్నికలు కాబట్టి కొన్నాళ్ళు మౌనంగా ఉన్నా ఆ తరువాత మోడీ మళ్ళీ వస్తే అపుడు స్టీల్ ప్లాంట్ సంగతేంటి. ఇది విజయసాయిరెడ్డి చెప్పలేదు, ఉక్కు కార్మికులు కూడా అడగలేదు.

కానీ ఇక్కడే రాజకీయం ఉంది అంటున్నారు. ఈసారి కచ్చితంగా బీజేపీ గెలవదు అన్న అంచనాలతోనే సాయిరెడ్డి ఇలా వ్యూహాన్ని రెడీ చేశారని అంటున్నారు. అంటే 2024లో వచ్చే కొత్త ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ని నిలబెడుతుందని ఆయన నమ్ముతున్నారు. మరి ఆయన బలంగా నమ్మే కొత్త ప్రభుత్వం ఏ పార్టీ నాయకత్వంలో వస్తుంది. దానికి ప్రధాని ఎవరు, ఇవన్నీ ఇప్పటికైతే సమాధానం లేని ప్రశ్నలే. ఒక్కటి మాత్రం నిజం. వైసీపీ ఆలోచనలు బట్టి చూసుకుంటే పొత్తులతో బీజేపీ మళ్ళీ పవర్ లోకి వచ్చినా మోడీ ప్రధాని అవరు అన్న అంచనాలు కూడా ఉన్నాయట. అందుకే ఇలా ఉక్కు పోరాట వేళ ఆయన ఫ్యూచర్ పాలిటిక్స్ గుట్టు విప్పారనుకోవాలి.

## కాగల కార్యం..గంధర్వులు తీర్చేశారు...

కడప, ఆగస్టు 6, (న్యూస్ పల్స్)బీజేపీ అంటే ఏంటో దేశంలోని ఇతర రాజకీయ పార్టీలకు బాగా తెలుసు. బీజేపీ విషయంలో ఒక కథ చెబుతారు. అరేబియన్ ఒంటె గుడారంలో తలదాచుకుందామని చోటు అడిగి మొత్తం ఆక్రమించినట్లుగా బీజేపీ తీరు ఉంటుందని కూడా అంటారు. ఉత్తరాది పార్టీగా ఉన్న బీజేపీని కర్నాటకలో అధికారం దక్కేలా చేసిన అనేక అంశాలలో టిప్పు సుల్తాన్ ఉదంతం కూడా అతి ముఖ్యమైనది. ఇపుడు ఆ టిప్పుని అడ్డం పెట్టుకుని ఏపీలో రాజకీయ తుప్పు రేపాలని చూస్తున్న కమలానికి చాలా తెలివిగా జగన్ చెక్ పెట్టేశారు.జగన్ ఇలాకాగా చెప్పబడుతున్న కడప గడపలోనే బీజేపీ ఈ సాహసానికి ఒడికట్టింది. మైనారిటీలు, మెజారిటీ వర్గీయులు అంటూ విభజన రేఖను గీస్తూ భారీ పొలిటికల్ స్కెచ్ గీసింది. ఒక వైపు రాష్ట్రంలో ఎన్నో సమస్యలు ఉండగా కేవలం దీని మీదనే బీజేపీ దృష్టి పెట్టి హడావుడి చేసింది. ఏపీలో పవర్ పట్టేలా ఎంట్రీకి కడపను గేట్ వేగా చేసుకోవాలనుకుంది. అయితే ధీటుగా వైసీపీ కూడా బదులిచ్చినా జగన్ మాత్రం దీన్ని కొనసాగించాలనుకోలేదు. బీజేపీ సంగతి తెలిసిన వారుగా ఆయన కాషాయం ఆటలు సాగనీయరాదు అనే తీర్మానించుకున్నారు. అందుకే టిప్పు విగ్రహానికి లేదు చోటు అనిపించేశారు.బీజేపీకి హిందూత్వ నినాదం చాలా ఇష్టం. అయితే ఏపీలాంటి చోట్ల అలాంటి ఎత్తులు పారడం కష్టం. అయినా సరే బీజేపీ తన ప్రయత్నాలను తాను చేస్తోంది. ఏపీలో ఇతర అంశాల మీద మాట్లాడితే ప్రతీ దాంట్లోనూ బీజేపీ తప్పుని జనాలు వెతుకుతారు. వీటన్నిటి కంటే కూడా బీజేపీ ప్రత్యేక హోదా ఇవ్వలేదు అన్న కోపం ఏపీ నిండా ఉంది. దాంతో బీజేపీ ఈ షార్ట్ కట్ విధానాన్నే నమ్ముకుంటోంది. అయితే అక్కడ ఉన్న జగన్ మాత్రం ఇలాంటి వాటికి చాకచక్యంగా ఆదిలోనే అడ్డుకట్ట వేసేస్తున్నారు.కడపలో టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటు కాకుండా అడ్డుకున్నామని, ఇది తమ విజయమని ఆ పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు పైకి గొప్పగా చెప్పుకుంటున్నారు. కానీ లోలోపల మాత్రం తమ ఎత్తులు పారలేదన్న బాధ ఉండే ఉంటుంది అంటున్నారు. ఏపీలో హిందూత్వ రాగాలు తీయడానికి అసలు ఒప్పనని వైసీపీ అధినాయకత్వం గట్టిగానే నిర్ణయించుకుంది. ఈ నేపధ్యంలో బీజేపీకి ఆదిలోనే ఇలా అతి పెద్ద చెక్ పడిపోయింది అనే చెప్పాలి.

## వైసీపీని ఎదుర్కొనేందుకు ప్లాన్

విజయవాడ, ఆగస్టు 6, (న్యూస్ పల్స్)యుద్ధం చేయకుండా గెలవడం ఎలా ? దీనికి కొత్త దారి వెతికేసింది ఏపీ లోని ప్రధాన విపక్షం తెలుగుదేశం పార్టీ. అధినేత మొన్నటి స్థానిక ఎన్నికల్లో చూపించిన మార్గమే ఇప్పుడు క్రింది స్థాయిలో అమలు చేయడమే బెటర్ అనుకుంటున్నారు నేతలు. వైసీపీ హవా ముందు జగన్ ఇస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ప్రతీ ఎన్నికల్లో కురిపిస్తున్న ఓట్ల వర్షం ప్రధాన విపక్షానికి అర్ధం అయిపోయింది. దాంతో తాము ఈ అక్రమ ఎన్నికల్లో తప్పుకుంటున్నాం అంటూ పంచాయితీ, ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో చేతులెత్తేసింది టిడిపి.కాకినాడ కార్పొరేషన్ లో రెండో డిప్యూటీ మేయర్ ఎన్నికకు ముందు తెలుగుదేశం ఈ పోటీ లో తాము లేమంటూ తెల్లజండా చూపించేసింది. వాస్తవానికి 2017 లో నిర్వహించిన నాటి కార్పొరేషన్ పాలకవర్గ ఎన్నికల్లో టిడిపి దుమ్ము రేపింది. 48 స్థానాలకు 32 సీట్లు గెలిచింది. ఇక్కడ 10 స్థానాల్లోనే వైసిపి గెలిచింది. అయినప్పటికీ ఈ స్థానంలో రెండో డిప్యూటీ మేయర్ ఎన్నిక జరిగితే కార్పొరేటర్ లు మెజారిటీ వైసీపీ కి జై కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. అదే జరిగితే కాకినాడ లో అంతో కొంత పట్టు ఉందని చెప్పుకోవడానికి సైతం ఆ పార్టీకి ఏమీ లేకుండా పోతుంది. దాని బదులు బలం లేకపోయినా వైసీపీ కే రెండో డిప్యూటీ మేయర్ అప్పగించడమే ఉత్తమం అనే మార్గాన్నే ఆ పార్టీ ఎంచుకోవడం ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్ గా మారిపోయింది.ఏపీ లో ఇప్పుడు ఏ ఎన్నికలు రాకుండా ఉండాలని టిడిపి గట్టిగా కోరుకుంటుంది. ఒక వేళ వస్తే తమ పరిస్థితి మరింత దిగజారుతుందన్న సంకేతాలు ప్రజల్లోకి వెళ్ళడం వల్ల విపక్షాలకు సీన్ లేదన్న సందేశం బలంగా పోతుందని ఆందోళన వ్యక్తం అవుతుంది. స్థానిక ఎన్నికల వంటివి ఎక్కడైనా జరిగి కొద్ది స్థానాల్లో అయినా కార్పొరేటర్ లు, కౌన్సిలర్లు, లేదా వార్డ్ మెంబర్లు వంటివారు విపక్షానికి చెందిన వారు గెలిచినా వెంటనే వైసీపీ లోకి దూకేస్తున్నారు. దాంతో అదేదో తామే అధికారపక్షాన్ని గెలిపించుకుని పనులు చేయించుకోవొచ్చు అనే ఆలోచనతో ఒకటి అర నెగ్గే స్థానాలను విపక్షాలు కోల్పోతున్నాయి. ఈ నేపధ్యంలో క్షేత్ర స్థాయిలో టిడిపి సంగతి ఎలా ఉన్నా జనసేన, బిజెపి వంటి పార్టీలు మరీ బలహీనపడిపోతున్నాయి.

## వైసీపీ వర్సెస్ టీడీపీ



గుంటూరు, ఆగస్టు 6, (న్యూస్ పల్స్)అసలు ఏపీ రాజకీయాల గురించి తెలిసిన వారెవరైనా సరే టీడీపీ, వైసీపీల మధ్య పోరును లైట్ తీసుకుంటారు. అంతలా వైసీపీ టీడీపీ నేతలు, కార్యకర్తలు విమర్శలు చేసుకుంటారు. 2018 మందు వరకు టీడీపీ హయాంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా? ఒక్కసారిగా 2018 సార్వత్రిక ఎన్నికల్లో వై.ఎస్? జగన్? మోహన్? రెడ్డి సారథ్యంలోని వైసీపీ పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో వైసీపీ వాళ్లు ఎక్కడ ఎలాంటి తప్పులు చేస్తారా? ఎలా ఆడుకోవాలా? అని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఎదురు చూస్తూ ఉండడం విశేషం.2018 కి ముందు కూడా టీడీపీ, వైసీపీల మధ్య చాలా గొడవలు జరిగాయి. చాలా మంది వైసీపీ మద్దతుదారులను సోషల్? మీడియాలో ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారంటూ పోలీసులు అరెస్టులు చేశారు. ప్రస్తుతం వైసీపీ వాళ్ల టైం వచ్చింది కాబట్టి టీడీపీ నాయకుల మీద కసి తీర్చుకుంటున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. అటువంటిదేం లేదని కేవలం రాష్ట్ర అభివృద్ధి కొరకే సీఎం జగన్? మోహన్? రెడ్డి తాపత్రయం పడుతున్నట్లు వైసీపీ నేతలు చెబుతున్నారు.తాజాగా వైసీపీ కార్యకర్త ఒకరు సోషల్? మీడియాలో చేసిన పోస్టు వైరల్? గా మారుతోంది. సదరు కార్యకర్త కేరళలోని ఇంటి బొమ్మను తీసుకువచ్చి ఏపీలో వైసీపీ ప్రభుత్వం కట్టిస్తోందని చెప్పడంతో జగడం స్టార్ట్? అయింది. ఏపీలోని జగనన్న ఇళ్లు అంటూ వైసీపీ నేతలు సోషల్? మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని టీడీపీ కార్యకర్తలు మండి పడుతున్నారు. అబద్దపు ప్రచారాలను మానుకోవాలని హితవు పలుకుతున్నారు. అబద్దాలు మాని రాష్ట్ర అభివృద్ధి పై కాన్సంట్రేట్? చేయాలని చెబుతున్నారు. ప్రస్తుతం ఇరు పార్టీల కార్యకర్తల మధ్య సోషల్? మీడియా వార్? నడుస్తోంది.

## కలహాలా... కాపురమా..

### అయోమయంలో చంద్రబాబు

విజయవాడ, ఆగస్టు 6, (న్యూస్ పల్స్)లుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు డైలమాలో ఉన్నారు. బీజేపీతో సఖ్యతగా ఉండటమా? తీవ్రస్థాయిలో ఇప్పటి నుంచే విభేదించడమా? అనేది తేల్చుకోలేకపోతున్నారు. బీజేపీతో జనసేన పొత్తు ఉండటంతో చంద్రబాబు నిర్ణయం తీసుకునేందుకు వెనకాడుతున్నారు. చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో ఏదో ఒక పార్టీతో పొత్తుతో పోటీ చేయాల్సిందే. మళ్లీ ఒంటరిగా పోటీ చేసే సాహసాన్ని చంద్రబాబు చేయరు.అయితే ఇప్పటివరకూ బీజేపీతోనే కలసి వెళ్లాలన్నది చంద్రబాబు ఆలోచన. బీజేపీ, జనసేన తనతో కలిస్తే జగన్ ను సులువుగా ఓడించవచ్చన్నది చంద్రబాబు ఆలోచన. కానీ బీజేపీ మాత్రం కలసి వచ్చేట్లు కనపడటం లేదు. జనసేనను బీజేపీ నుంచి విడగొడితే తన లక్ష్యం చాలా వరకూ నెరవేరుతుందన్నది చంద్రబాబు వ్యూహం. ఆ వ్యూహాన్ని అమలు చేసే ప్రయత్నంలో చంద్రబాబు ఉన్నట్లు తెలిసింది.జనసేన కూడా బీజేపీ వ్యవహారం పట్ల సంతృప్తికరంగా లేదు. మోదీ ఇమేజ్ క్రమంగా తగ్గుముఖం పడుతుండటం, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు నిధుల విడుదల వంటి వాటి విషయంలో పవన్ కల్యాణ్ అసంతృప్తికరంగా ఉన్నారు. అందుకే బీజేపీతో సంబంధం లేకుండా జాబ్ క్యాలెండర్ పై నిరసనకు పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. దీనిని చంద్రబాబు తనకు అనుకూలంగా మలుచుకోవాలని భావిస్తున్నారు.నిజానికి ఏపీలో బీజేపీతో పెద్దగా ఒరిగేదేమీ లేదు. దాని ఓటింగ్ శాతం కేవలం ఒకటి నుంచి రెండు శాతమే. తాము కలుపుకోకపోయినా తమ ఓట్లు చీల్చే శక్తి బీజేపీకి లేదన్నది చంద్రబాబు భావన. సాధ్యమయినంత వరకూ జనసేనను బీజేపీకి దూరం చేసి తమతో కలుపుకోవాలన్న ఉద్దేశ్యంతో చంద్రబాబు ఉన్నారు. జాతీయ పార్టీల రెండింటిని దూరం పెట్టి రెండు ప్రాంతీయ పార్టీలుగా కలసి పోటీ చేస్తే సత్ఫలితాలుంటాయని చంద్రబాబు భావిస్తున్నారు. త్వరలోనే పవన్ కల్యాణ్ కు ఈ మేరకు ఆహ్వానం పంపనున్నట్లు తెలిసింది.

# అప్పన్న భూములపై కన్ను

విశాఖపట్టణం, ఆగస్టు 6, (న్యూస్ పల్స్)చాలా మంది టీడీపీ నేతలు సింహాచలం దేవస్థానం ఆస్తులను కొల్లగొట్టారు. అడవి వరంలో ఆలయానికి చెందిన భూమినే ఒక సంస్థకు కేటాయించారు. ఆ సంస్థ నుంచి టీడీపీకి చెందిన మాజీ మంత్రి ఒకరు బినామీ పేర్లతో కొనుగోలు చేశారని తెలుస్తోందిసింహాచలం దేవస్థానానికి 9,069 ఎకరాల భూమి ఉంది. ఇందులో 862.22 ఎకరాల భూమి ఆలయానికి చెందినది కాదంటూ.. దానిని తొలగించేందుకు అప్పటి ఈవో రామచంద్రమోహన్ ద్వారా 2016లో ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇందుకు అనుగుణంగా 2016 మే 31న ఫలానా ఆస్తులు సింహాచలం ఆలయానికి చెందినవి అనే ఆధారాలు లేవంటూ.. వాటిని జాబితా నుంచి తొలగించాలని అప్పటి దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ఫైల్ పంపారు. అయితే.. ఆలయ ఆస్తుల జాబితా నుంచి తొలగించేందుకు గానూ సరైన ప్రాతిపదిక లేదని పేర్కొంటూ ఆ అధికారి ఆ ఫైల్‌ను ఈవోకు తిప్పి పంపారు. ఏడాదైనా ఆ ఫైల్ తిరిగి రాలేదు. ఆ తరువాత కాలంలో ఇద్దరు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్లను ప్రభుత్వం ఎటువంటి కారణాలు లేకుండా బదిలీ చేసింది. ఆ తర్వాత 2017లో 862.22 ఎకరాలను తొలగిస్తూ ఆలయ భూముల జాబితాను ప్రచురించారు. వాస్తవానికి ఈ జాబితా ప్రకటన దేవదాయ శాఖ కమిషనర్ నుంచి అనుమతి తీసుకున్న తర్వాతే జరగాలి. ఇక్కడ ఈ నిబంధన అమలు కాలేదు. కేవలం దేవదాయ శాఖ కమిషనర్ నుంచి మౌఖిక ఆదేశాలు ఉన్నాయని పేర్కొంటూ 862.22 ఎకరాలను తొలగిస్తూ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ప్రధానంగా టీడీపీ నేతలు ఈ భూములను ఆక్రమించేందుకు ఈ తతంగం మొత్తం నడిపారని దేవదాయ శాఖ అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది.సింహాచలం ఆలయ భూముల వ్యవహారాలతో పాటు మాన్సాస్ ట్రస్టు భూముల అక్రమాలపై దేవదాయ శాఖ అధికారులు చేపట్టిన విచారణ నివేదికను గత నెల 16న ఆ శాఖ కమిషనర్‌కు సమర్పించారు. ప్రధానంగా ఆలయ ఆస్తులను కాజేసేందుకే తొలగింపు వ్యవహారం నడిచిందని.. అది కూడా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని తమ నివేదికలో అధికారులు పేర్కొన్నట్టు తెలిసింది. అలాగే ఆలయానికి చెందిన భూములు, ఆస్తులను లీజులకు ఇవ్వడంలో గోల్‌మాల్ జరిగిందని నిర్ధారించారు. దీనిపై మరింత లోతుగా విచారణ జరగాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రధానంగా ఈ భూములు ఎవరు ఆక్రమించారు, ఆలయ భూములను లీజుకు ఇవ్వడంలో నిబంధనలను ఎలా తొక్కిపట్టారు, ఎవరికి లీజుకు ఇచ్చారు, ఎవరి ఒత్తిడి ఉందనే కోణంలో ఇంకా విచారణ జరగాల్సి ఉందని పేర్కొన్నారు. మొత్తం మీద ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారణ జరిపితే మరింత మంది బయటకు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

# ఎటూ చూసినా రెడ్ సిగ్నల్సే...

విజయవాడ, ఆగస్టు 6, (న్యూస్ పల్స్)కొత్తగా ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ నిలదొక్కుకోవాలంటే కేంద్రప్రభుత్వ సహకారంతో పాటు రాష్ట్రమూ అనేక రకాలుగా కష్టపడాలి. కేంద్రం పూచికపుల్ల అదనంగా విదిల్చేది లేదని ఇప్పటికే తేల్చి చెప్పేసింది. ప్రత్యేక హోదా సంగతే ఎత్తడానికి ఇష్టపడటం లేదు. ఈ స్థితిలో రాష్ట్రం గడ్డు పరిస్తితినే ఎదుర్కొంటోంది. దానికి తోడు తెలివి తక్కువ నిర్ణయాల కారణంగా దీర్ఘకాలం ఇబ్బందులను కొని తెచ్చుకుంటోంది. వ్యవసాయాధారిత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఆదాయం పెంచుకోవాలంటే పారిశ్రామికీకరణకు పెద్దపీట వేయాలి. సాఫ్ట్ వేర్ వంటి సర్వీసు ఆధారిత రంగాలు ఏపీకి వచ్చే అవకాశాలు అంతంతమాత్రమే . హైదరాబాద్, బెంగుళూరు, చెన్నైలు ఆ అవకాశాలను పూర్తి స్థాయిలో ఒడిసిపట్టాయి. చాలా వేగవంతమైన అభివృద్ధి, ఉపాధి కల్పనకు ఉపకరించే సర్వీస్ సెక్టార్ అనుకూల పరిస్థితులు లేవు. పన్నుల రూపంలో వ్యవసాయం నుంచి ప్రభుత్వానికి పెద్దగా ఆదాయం రాదు. అందువల్ల పరిశ్రమలను ప్రోత్సహిస్తూ, ఉపాదికి ఊతమిస్తూ క్రమేపీ ఆదాయం పెంచుకోవడం తప్పనిసరి. కానీ ఆంధ్రప్రదేశ్ సర్కారు ధోరణి తప్పుడు సంకేతాలు పంపుతోంది.దీర్ఘకాలం నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీలు సందిగ్ధావస్థకు లోనవుతున్నట్లు తాజా పరిణామాలు వెల్లడిస్తున్నాయి. ఇది చాలా ప్రమాదకరమైన ధోరణే. చిత్తూరు జిల్లా పారిశ్రామికంగా పునాది వేసుకోవడానికి అమరరాజా కంపెనీ కొంతవరకూ దోహదం చేసింది. తాజాగా ఆ కంపెనీ రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఆ సంస్థ వ్యవస్థాపకులకు తొలి నుంచి కాంగ్రెసుతో అనుబంధం ఉంది. ఇప్పటి కంపెనీ నిర్వాహకుడు జయదేవ్ తెలుగుదేశం పార్టీ ఎంపీ కావడంతో సమస్య పెరిగినట్లుగా కనిపిస్తోంది. సాధారణ రాజకీయాలకు పరిశ్రమల మనుగడతో ముడిపెట్టడం ప్రమాదకరధోరణి. ప్రభుత్వ నియంత్రణ సంస్థల నుంచి వరసదాడులు, హెచ్చరికల నేపథ్యంలో తమిళనాడుకు తరలి పోవడానికి అమరరాజా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అదే జరిగితే చిత్తూరు జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు లక్ష కుటుంబాల ఉపాధి కి దెబ్బ తగులుతుంది. అదే జిల్లాలో గతంలో రిలయన్స్ కంపెనీ మొబైల్ ఫ్యాక్టరీ ప్రతిపాదన కూడా పట్టాలపైకి రాలేదు. ఉన్న కంపెనీలు తరలిపోతుంటే కొత్త కంపెనీలు రావడానికి సాహసించకపోవచ్చు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రగతిపై పెను ప్రబావం పడుతుంది.గడచిన నాలుగైదు నెలలుగా జీతాలు సకాలంలో చెల్లించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇబ్బందులు పడుతోంది. నెలవారీ అయిదువేల అయిదువందల కోట్ల రూపాయలు జీతాలు, పింఛన్ల నిమిత్తం అవసరమవుతాయి. రాష్ట్రానికి అంత పెద్ద మొత్తంలో వనరులు సమకూరడం లేదు. అందువల్ల ప్రతినెలా అప్పులు తెచ్చి పరిస్తితిని చక్కదిద్దుతున్నారు. రాష్ట్రంలో పనిచేసి పదవీ విరమణ చేసిన అఖిలభారత సర్వీసు అధికారులకు పింఛన్లు మొత్తాన్ని కేంద్రం అంద చేస్తుంది. అయితే వాటిని ముందుగా రాష్ట్రప్రభుత్వమే చెల్లిస్తుంది. తర్వాత ఆ మొత్తాన్ని కేంద్రం సర్దుబాటు చేస్తుంది. ప్రతినెలా నిర్దిష్ట కాలంలో ఈ చెల్లింపు సాగకపోవడం పట్ల కొందరు రిటైర్డ్ అధికారులు అసహనంతో ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా నేరుగా కేంద్రం చెల్లింపులు చేయాలని వారు కోరుతున్నారు. ఈ మేరకు అధికారికంగా కేంద్రానికి వారు లేఖలు రాస్తే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అవమానకరమే. రాష్ట్రంలో ఉద్యోగ వర్గాలకు సైతం తప్పుడు సంకేతాలు వెళతాయి.పూర్తిగా ఆర్తిక సమస్యలు కమ్ముకోవడంతో అవసరార్థం అబద్దాలు చెప్పక తప్పని స్తితి ఏర్పడింది. వివిధ రూపాల్లో పేరుకున్న బకాయిలు చట్ట ప్రకారం చెల్లించాలంటూ హైకోర్టు అనేక సందర్భాల్లో ప్రభుత్వాన్ని ఆదేశిస్తోంది. ప్రభుత్వం ఉదాసీనంగా ఉండటంతో బకాయి దారులు అనేక మంది మళ్లీ మళ్లీ కోర్టును ఆశ్రయిస్తున్నారు. అయినా చెల్లింపులు జరగడం లేదు. దీంతో కోర్టు ధిక్కరణ వంటి వ్యాజ్యాలు దాఖలు అవుతున్నాయి. తాజాగా ఉపాధి హామీ పనుల నిధులకు సంబంధించిన కేసులో రెండువేల కోట్ల రూపాయల వరకూ చెల్లించాలని తేల్చారు. కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంతపెద్దమొత్తాన్ని చెల్లించేందుకు నిధులు లేక సతమతమవుతోంది. అలాగే జీతాల కోసం రిజర్వ్ బ్యాంకు వద్ద సెక్యూరిటీలు వేలం వేసి రెండు వేల కోట్ల రూపాయలు సమకూర్చుకుంది. ప్రభుత్వ ఖజానాకు రాకుండానే రిజర్వ్ బ్యాంకు ఇప్పటికే చేసిన ఓవర్ డ్రాఫ్ట్ అప్పుకింద నొక్కి పట్టింది. ఈ పరిణామాలన్నీ తీవ్రమవుతున్న ఆర్థిక దుస్థితికి సంకేతాలుగా నిలుస్తున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖకు ఫిర్యాదులు అందుతున్నాయి . ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిధుల సమీకరణకు కేంద్రం అడ్డు చెబుతోంది. చట్టబద్ధమైన విధానాల ద్వారా కాకుండా భవిష్యత్ ఆదాయాన్ని సెక్యూరిటీగా చూపుతూ అప్పులు చేస్తున్నారు. బ్యాంకుల నుంచి 18,500 కోట్లు పరిమితికి మించి అప్పులు చేశారు. ఈ విషయాన్ని కేంద్రం గుర్తించి హెచ్చరికలు జారీ చేసింది. దీనివల్ల రాష్ట్రంలో బ్యాంకులు కొత్తగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అప్పులు ఇవ్వకపోవచ్చు. మొత్తమ్మీద ముప్పేట దాడిగా ఆర్థిక దిగ్బంధనం కొనసాగుతోంది. ఇప్పటికైనా మేలుకొని ఆర్థిక క్రమ శిక్షణ కు పూనుకోకపోతే ప్రభుత్వ రథం ముందుకు కదలడం కష్టమే.

# ఆచరణలో కళ తప్పిన వైఎస్ ఆర్ జలకళ

విజయవాడ, ఆగస్టు 6,(న్యూస్ పల్స్) రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైఎస్ఆర్ జలకళ ఆచరణలో కళ తప్పింది. నాలుగేళ్లలో రెండు లక్షల మంది రైతులకు ఉచితంగా బోరు వేయడం, విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం ఈ పథకం లక్ష్యం. ఇందుకోసం రూ.2,340 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం గతేడాది సెప్టెంబరులో ప్రారంభించింది. ఆ సమయంలో మెట్ట పొలాల్లో పైర్లు ఉన్నందున అవి చేతికొచ్చాక బోర్లు వేస్తామని దరఖాస్తులు తీసుకోవడం ప్రారంభించారు. ఇందులో భాగంగా 1,88,082 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో 50,333, ఆఫ్‌లైన్‌లో 1,37,749 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఐదు శాతం మందికైనా బోరు వేయని పరిస్థితి ఉంది. ఇప్పటి వరకూ వచ్చిన దరఖాస్తుల్లో వీఆర్ఓ స్థాయిలో దాదాపు 62 వేల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. 1,26,712 దరఖాస్తులను వీఆర్ఓ స్థాయిలో అప్రూవల్ చేశారు. వీఆర్ఓ పోర్టల్ నుంచి 1,26,712 దరఖాస్తులు రిగ్గు కాంట్రాక్టర్లకు చేరగా, అందులో 33,610 దరఖాస్తులను మాత్రమే జియాలజిస్టులు సర్వేచేసి అప్రూవల్ ఇచ్చారు. ఇంకా దాదాపు లక్ష దరఖాస్తులు జియాలజిస్టు సర్వే కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి ఉంది. జువాలిజిస్టుల సిఫార్సులతో వెళ్లిన 33,610 దరఖాస్తుల్లో కేవలం 25,682కు మాత్రమే బోర్లు వేసేందుకు అధికారులు సిఫార్సులు చేశారు. అందులో బోర్లు వేసిన వాటిలో ఒక్కదానికైనా విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. దరఖాస్తు చేసుకున్న ప్రతి పేదరైతుకూ ఈ పథకాన్ని వర్తింపజేస్తామని ప్రభుత్వం చెప్పినా ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. ఇప్పటికే ఆర్‌డబ్ల్యుఎస్‌లో వేసిన బోర్లుకు బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వం నిలిపివే యడంతో రిగ్గు యజమానులు కొత్తబోర్లు వేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో జలకళ పథకం స్తంభించి పోయింది. ఆన్‌లైన్ వెబ్‌సైట్ పనిచేయకపోగా, క్షేత్రస్థాయిలో సర్వేలు నిలిచిపోయాయి.

# ఆగస్టు 9న క్విట్ ఇండియా స్ఫూర్తితో సేవ్ భారత్

## ఆందోళన కార్యక్రమం జయప్రదం చేయాలని

## విజ్ఞప్తి వాల్ పోస్టర్లు విడుదల

కడప ఆగస్టు 06కడపజిల్లాబ్రిటిష్ పరాయి పాలన వ్యతిరేకంగా స్వాతంత్ర ఉద్యమంలో క్విట్ ఇండియా ఆనాడు పిలుపిచ్చారని,నేడు మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న స్వదేశీ ముసుగులో విదేశీ సంస్థలుకు కార్మిక హక్కులు తాకట్టు పెడుతూ, రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తు దేశ సంపద పరిరక్షించుకునే విధముగా ఆగస్టు 9న దేశ వ్యాప్తంగా ఆందోళన లో బాగంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన జయప్రదం చేయాలని రైల్వే గూడ్స్ షేడ్ హమాలి వర్కర్స్ యూనియన్ ఏఐటీయుసీ అధ్యక్ష,కార్యదర్శి కేసి బాదుల్లా, ఎస్. మహబూబ్ భాష లు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రైల్వే స్టేషన్ ఆవరణలో వాల్ పోస్టర్లు విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతుందని ప్రజలపై అధిక భారాలు వేస్తూ పెట్రోల్ ,డీజిల్ ధరలు విపరీతంగా పెంచి వేస్తూ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బ్రిటిష్ కాలంలోనే లక్షలాది మంది కార్మికులు తమ ప్రాణాలను అర్పించి సాధించుకున్న 44 చట్టాలను సవవరించి 4 కోడ్ బిల్లులను పార్లమెంట్లో ఆమోదించడం కార్మికుల హక్కులను హరించడమేనని ఆవేదన వ్యక్తంచేశారు.వ్యక్తంచేశారు.బి.జె.పి రెండవ సారి అధికారంలోకి రాగానే ప్రభుత్వ సంస్థలన్నింటిని ప్రవేట్ కార్పొరేట్ శక్తులకు ఆదాని, అంబానీ లకు అప్పజెప్పి ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.కార్మికుల హక్కులను హరించే ప్రయత్నాలు మానుకోకపోతే గత ప్రభుత్వాలకు పడిన గతే పడుతుందిని చరిత్ర గుర్తెరిగి విధానాలు తీసుకోవాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో రైల్వే గూడ్స్ షేడ్ హమాలి యూనియన్ నాయకుల పాల్,మాబు, గంగరాజు, సుబ్బరామ్ లు పాల్గొన్నారు.

# నేతన్నల ఆందోళన

పాలకొల్లు ఆగస్టు 6, (న్యూస్ పల్స్)పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామ సచివాలయం వద్ద నేతన్న నేస్తం పేరుతో చేనేత కార్మికులకు అందిస్తున్న నెలకు రెండు వేల చొప్పున సంవత్సరానికి 24 వేల రూపాయలు ఇచ్చే నేతన్న నేస్తం పథకానికి తమను అర్హులు కాదని తొలగించారని సచివాలయం వద్ద మగ్గ లతో నేత పడులతో చేనేత కార్మికులు నిరసన చేపట్టారుఅయితే గత రెండు సంవత్సరాలుగా గ్రామంలో 163 మగ్గాల కు గాను అందరికీ లబ్ధి జరిగిందని అయితే ఈ సంవత్సరం 163మంది గాను 95 మంది మాత్రమే అర్హులుగా గుర్తించి 68 మందిని అనర్హులుగా తొలగించడం జరిగిందని చేనేత వృత్తి పై బ్రతుకుతున్న వారిని ఇలా అనర్హులుగా చేసి మాకు ప్రభుత్వం ఇచ్చే లబ్ధిని జగనన్న నేతన్న నేస్తం అందకుండా చేయడం దారుణమని తక్షణమే న్యాయం చేయాలంటూ గ్రామ సచివాలయం మరియు ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు ఈ రోజు ఇలామహిళలతో సైతం రోడ్డుపైకి వచ్చినందుకు తమకు వచ్చే రోజువారి కూలి 200 రూపాయలు కూడా నష్టపోయామని వాపోయారు.

# సర్వేపల్లి లో మట్టి తవ్వకాల కేసులో ఏ2 ఎంపీ మాగుంట

## నెల్లూరు జిల్లా వెంకటాచలం లో కేసు నమోదు

నెల్లూరు ఆగస్టు 6, (న్యూస్ పల్స్) ఒంగోలు వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిపై నెల్లూరు జిల్లా వెంకటాచలం పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. జూన్ 21న ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదుతో నమోదైన కేసులో ఎంపీని ఏ2 నిందితుడిగా పేర్కొన్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. సర్వేపల్లి రిజర్వాయర్‌లో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపారన్న అభియోగాలతో మాగుంటపై కేసు నమోదు చేశారు. అధికార పార్టీ ఎంపీపై కేసు నమోదు కావడంతో ఈ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు రేపుతోంది. వివాదాస్పదంగా మట్టి తవ్వకాలు వెంకటాచలం మండలంలోని సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి పేరుతో 2వేల క్యూబిక్ మీటర్ల తవ్వకాలకు మే 28న దరఖాస్తు చేసుకోగా, ఆ మరుసటి రోజే ఇరిగేషన్ అధికారులు అనుమతులు జారీ చేశారు. ఆ తర్వాత జూన్ 5న కనుపర్తిపాడులోని మాగుంట ఆగ్రో ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మట్టి అవసరమని ఎం.శ్రీనివాసులురెడ్డి తండ్రి రాఘవరెడ్డి పేరుతో 3వేల క్యూబిక్ మీటర్ల తవ్వకాలకు దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకున్నారు. అలాగే జూన్ 18న బి.శ్రీధర్‌రెడ్డి, ఎం.శ్రీనివాసులురెడ్డి చెరో 1000 క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలకు అనుమతులు పొందారు. అయితే, ఈ మట్టిని అనుమతులు తీసుకున్న చోటకు కాకుండా మార్కెట్లోకి తరలించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వేపల్లి రిజర్వాయర్‌లో అనుమతులకు మించి తవ్వకాలు జరుగుతున్నాయని టీడీపీ నేతలు ఆధారాలతో సహా ఆరోపిస్తూ వచ్చారు. రాత్రివేళల్లో తవ్వకాలు జరుగుతున్న ఫొటోలను కూడా బహిర్గతం చేశారు. ఈ వ్యవహారంపై ఆరోపణలు వెల్లువెత్తడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు రిజర్వాయర్‌లో కొలతలు వేసి అనుమతులకు మించి తవ్వకాలు జరిగినట్లు గుర్తించారు. 8వేల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వగా, 18,629 క్యూబిక్ మీటర్లు తవ్వినట్లు తేల్చారు. ఎంపీ సంతకం ఫోర్జరీ?అనుమతులకు మించి తవ్వకాలు జరిపిన నేపథ్యంలో నిబంధనల ప్రకారం అనుమతులు పొం దిన ముగ్గురిపై ఇరిగేషన్ డీఈ, జేఈ వెంకటాచలం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఏ1గా తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఏ2గా ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఏ3గా బి.శ్రీధర్‌రెడ్డిని చేరుస్తూ 427ఐపీసీ, 21(4) ఎంఎండీఏఆర్ఏ సెక్షన్ల కింద జూన్ 21న కేసు నమోదు చేశారు. అయితే ఆ తర్వాత ఈ కేసును పక్కన పెట్టారు. కాగా, సర్వేపల్లి రిజర్వాయర్‌లో తవ్వకాలకు సంబంధించి అనుమతులు, కేసు నమోదు వంటి వివరాలను ఇటీవల టీడీపీ నేతలు ఆర్టీఐ చట్టం ద్వారా సేకరించారు. ఈ క్రమంలోనే ఎంపీ మాగుంటపై కేసు నమోదైన విషయం వెలుగులోకి వచ్చింది.

అయితే ఎం. శ్రీనివాసులురెడ్డి తండ్రి రాఘవరెడ్డి అంటే ఆయన మాగుంట శ్రీనివాసులురెడ్డి అని ఇరిగేషన్ అధికారులు, పోలీసులకు తెలియలేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మట్టి తవ్వకాలకు ఎవరు దరఖాస్తు చేసుకున్నారో కూడా చూడకుండా అధికార నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అనుమతులిచ్చారా? అన్న ప్రశ్నలు వస్తున్నాయి. ఫోర్జరీసంతకంతోఇరికించారు: సోమిరెడ్డిఒంగోలు వైసీపీ ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డికి తెలియకుండా ఆయన పేరుతో గ్రావెల్ తవ్వకాలకు వైసీపీ నేతలు ఫోర్జరీ సంతకాలతో దరఖాస్తు పెట్టిన ఫలితంగానే కేసు నమోదైందని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈ వ్యవహారం వెనుక సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. ఈ మేరకు గురువారం సోమిరెడ్డి మీడియాతో మా ట్లాడుతూ.. 'సర్వేపల్లి రిజర్వాయర్‌లో గ్రావెల్ అక్ర మ తవ్వకాలపై మేం కొంతకాలంగా పోరాడుతున్నాం. దీంతో చుట్టుపక్కల గ్రామస్థులు తవ్వకాలను రికార్డు చేసి అధికారులకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో తప్పనిసరి పరిస్థితుల్లో ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యా దు చేశారు. కేసులో రెండో నిందితుని గా మాగుంట పేరును చేర్చారు. మాగుంటది పెద్ద పారిశ్రామిక కుటుం బం. వాళ్లు సాధారణ మట్టి తవ్వకాలకు దరఖాస్తు చేస్తారా.అక్రమ తవ్వకాలు చేస్తారా లేదా అన్నది ఆలోచించకుండా కేసు పెట్టారు" అని అన్నారు.

# దళితుల ఆందోళన

ఏలూరు ఆగస్టు 6, (న్యూస్ పల్స్)పశ్చిమగోదావరి పెనుమంట్ర మండలంలో దళిత సంఘాల నేతలు నిరసనకు దిగారు. గుంటూరు జిల్లా చుండూరు దళితులు మృతి చెంది 30 ఏళ్లు పూర్తెవుతున్న సందర్భంగా అమర వీరులకు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మృతులకు నివాళి అర్పించిన దళిత సంఘాల నేతలు ... చుండూరు దళితులకు నేటికీ న్యాయం జరగలేదని అన్నారు.తక్షణమే దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని దళిత సంఘం నేత రాజు డిమాండ్ చేశారు.

# రైతుల అర్ధనగ్న నిరసన

తుంగతుర్తి ఆగస్టు 6, (న్యూస్ పల్స్) తరుగు తీసిన ధాన్యంకు డబ్బులు చెల్లించాలని రైతులు గేదెకు మంగళహారతి ఇస్తూ అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. బాధితులు మాట్లాడుతూ తుంగతుర్తి మండలం అన్నారం, సంగెమ్ ఐ కే పి సెంటర్ల లో క్వింటాల్ కు 5 నుండి 10 కిలోల ధాన్యం తరుగుక్రింద తీసి రైతుల పొట్ట కొ ట్టినారు. కలెక్టర్, ఆర్ డి ఓ కు పిర్యాదు ఇచ్చి రెండు నెలలు కావొస్తున్నా పట్టించుకోనందుకు నిరసనగా ప్రజావాణి పార్టీ రైతులు తన్నీరు వెంకన్న, బాజే ప్రకాశం, టి. శ్రీను లు గేదెకు మంగలి హారతి ఇస్తూ అర్ధ నగ్నంగా అన్నారం గ్రామం లో నిరసన తెలిపారు. రైతుల సమస్యను పట్టించుకోకుండా జిల్లా కలెక్టర్, ఆర్ డి ఓ తమ విధుల్లో నిర్లక్ష్యంగా ఉ న్నారని రైతుల బా ధలు పట్టించుకోవడం లేదని ప్రభుత్వం ఉన్నట్లా, లేనట్లా అనే అనుమానం కలుగుతుంది అంటున్నారు. తరుగు తీసిన ధాన్యానికి డబ్బులు ఇప్పించకుండా కలెక్టర్, ఆర్ డి ఓ ల నిర్లక్ష్యం పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ కి, గవర్నర్ కు, హై కోర్టు కు, మానవహక్కుల సంఘానికి పిర్యాదులు చేస్తున్నామని తెలిపారు. ధాన్యం తరుగు డబ్బులు ఇప్పించేవరకు నిరసనలు ఇలానే అనునిత్యం కొనసాగుతాయన్నారు. రైతులవద్ద తరుగు ధాన్యం ఎగగొట్టిన మిల్లులపై, ఐ కే పి సెంటర్ నిర్వాహకులపై చర్యలు తీసుకొని మాదాన్యానికి తూకం ప్రకారం మొత్తం డబ్బులు ఇప్పించాలని రైతులు డిమాండు చేశారు. రైతుల న్యాయమైన డిమాండ్లై న తరుగు ధాన్యం డబ్బులు చెల్లించే వరకు రైతులు చేసే శాంతియుత చట్టబద్ధమైన ఉద్యమానికి నిరసనలు తెలిపినారు. తరుగు ధాన్యం డబ్బుల కోసం అన్నారం గ్రామం లో గేదెకు మంగళహారతి ఇస్తూ అర్ధనగ్ననీ గా నిరసన తెలిపిన రైతుల పేర్లు. తన్నీరు వెంకన్న, బాజే ప్రకాశం, తాళ్లపెల్లి శ్రీనులు పాల్గొన్నారు.

# మసీదు మరియు మదర్సా లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు ఆగస్టు 6, (న్యూస్ పల్స్) నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు బిట్ 1 శ్రామిక నగర్ లో మసీదు మరియు మదరస కు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు ముస్లిం మతపెద్దలు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కోటంరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమ పవిత్రమైన ఖురాన్ గ్రంథాన్ని పట్టించేందుకు మరియు గ్రంథ విశిష్టతను తోటి ముస్లిములకు తెలియజేయుటకు మరియు ప్రార్థనలకు మసీదులు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నాయని తెలిపారు. ఇందులో భాగంగానే ముస్లిముల మనోభావాలను ఆధ్యాత్మిక చింతనతో తమ తోటి వారికి ఉపయోగపడే విధంగా విద్యను అభ్యసించుటకు వీలుగా మదర్సాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఎంతోకాలం నుండి ఖురాన్ పవిత్ర గ్రంథాల్ని ముస్లిం పిల్లలకు మరియు పెద్దలకు క్లుప్తంగానూ స్పష్టంగానూ తెలియజేయడమే కాకుండా నైతిక విలువలను పెంపొందించుటకు మదర్సాలు ఎంతో అవసరమన్నారు. ఈ క్రమంలో స్థానికంగా మసీదు మరియు మదర్సాలను నిర్వహించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించడం హర్షణీయమన్నారు.

ఈ కార్యక్రమంలో 31వ డివిజన్ ఇంఛార్జ్ కూకాటి ప్రసాద్, కూకాటి హరి, నారాయణ రెడ్డి, 32వ డివిజన్ ఇంఛార్జ్ బత్తల కృష్ణ, షమీ హుస్సేన్, సంషుద్దీన్, కరీముల్లా, డాక్టర్ సత్తార్, రియాజ్, బాబులు, ఖాదర్ బాషా, జమీర్, అహ్మద్ బాషా, రజాక్, ఇస్మాయిల్ ఖాద్రి, రసూల్, నజీర్, రఘు, యానాదయ్య, విగ్నేష్, ఆనంద రావు, పాశం మరియు వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పైనాపిల్ లోడ్ లో గంజాయి రవాణా

విశాఖపట్నం గంజాయి రవాణా పై మాడుగుల పోలీసులు ఉక్కుపాదం మోపారు అక్రమ గంజాయి పై నిఘా దాడులు నిర్వహిస్తున్నారు. ఈ రోజు విశాఖ జిల్లా పాడేరు ఏజెన్సీ నుండి ఒక లారీ పైనపిల్ లోడు వచ్చింది. వి.మాడుగుల మండలం గరికబంద చెక్ పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీ చేసారు.బారీగా గంజాయి గుర్తించారు.ఒక లారీలో పైనాపిల్ పండ్ల మాటున అక్రమంగా తరలిస్తున్న 2000 కేజీల గంజాయిని మాడుగుల పోలీసులు పట్టుకున్నారు... గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టుకోగా మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారని మాడుగుల ఎస్ఐ రామారావు తెలియజేశారు... గంజాయి రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ కేసులో పీ.డిఏక్టు. కేసు నమోదు చేశామని మాడుగుల ఎస్సై రామారావు తెలియజేశారు.జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాలు మేరకు గరికిబంద చెక్ పోస్ట్ పెట్టమని దీని ద్వారా ఎక్కువగా గంజాయి పట్టుకోవడం జరుగుతుంది అని మాడుగుల ఎస్.ఐ.రామారావు పేర్కొన్నారు...

# కావలి పట్టణలాక్ డౌన్ లోఎలాంటి మార్పు లేదు

## కావలి డీఎస్పీ దేవరకొండ ప్రసాదరావు

నెల్లూరు నెల్లూరు జిల్లా, కావలిలో కొనసాగుతున్న కర్ఫ్యూ వేళల్లో ప్రస్తుతానికి ఎలాంటి మార్పులు లేవని కావలి డివిజనల్ పోలీసు అధికారి దేవరకొండ ప్రసాదరావు స్పష్టం చేశారు . శుక్రవారం ఉదయం డీఎస్పీ చాంబర్లో జరిగిన మీడియా సమావేశంలో ప్రసాదరావు మాట్లాడుతూ కరోన నియంత్రణ దృష్టిలో వుంచుకొని అన్ని రాజకీయపక్షాల నాయకులు , వివిధ శాఖల అధికారులు , వ్యాపారస్తులు , ప్రజలు , మీడియా ప్రతినిధులు కలిసి కర్ఫ్యూ వేళలు సాయంత్రం 6 గంటల నుండి ఉదయం 6 గంటలవరకు ఉండేవిధంగా గతంలో తీసుకున్న నిర్ణయమే ప్రస్తుతం అమల్లోవుందన్నారు . కొత్తగా ఎలాంటి మార్పులు జరగలేదన్నారు . ఎలాంటి మార్పులు వున్నా ముందుగా మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు . నెల్లూరు నగరంలోనూ సాయంత్రం 6 గంటలనుండి ఉదయం 6 గంటలవరకు కర్ఫ్యూ కొనసాగుతుందన్నారు . చిన్న చిన్న వ్యాపారస్తులు , చిన్న పనులు చేసుకొని జీవనం సాగిస్తున్న పేదలను , ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని తీసుకున్న గత నిర్ణయం ప్రకారమే కర్ఫ్యూ కొనసాగుతుందన్నారు . కర్ఫ్యూ వేళల్లో మార్పులేమీ జరగలేదన్నారు . కరోన నియంత్రణకు అధికారులు ఎంతో కృషి చేస్తున్నారని , అధికారులకు ప్రజలు సహకరిస్తే థర్డ్ వేవ్ ను అరికట్టవచ్చున్నారు . ప్రజల్లో చైతన్యం రావాలన్నారు . ప్రజల్లో మార్పు రానిదే ఏదీ సాధ్యంకాదన్నారు . ప్రజలు బయటికి వచ్చేటప్పుడు మాస్క్ ధరించడం , భౌతిక దూరం పాటించడం , శానిటైజ్ చేసుకోవడం లాంటివి ప్రధానంగా పాటించాలని డీఎస్పీ దేవరకొండ ప్రసాదరావు ప్రజల్ని కోరారు .

# ఆందోళన తో నిలిచిపోయిన రైళ్లు

నెల్లూరు ఆగస్టు 6, (న్యూస్ పల్స్) చెన్నై నుండి సూళ్లూరుపేట, నెల్లూరు , గుమ్మిడిపూండి మధ్య నడిచే ఈఎంయూ రైళ్లు ప్రతి రోజు ఆలస్యంగా తిరగడం పై ప్రయాణికులు ఆగ్రహంతో ఆందోళనకు దిగారు. తమిళనాడు లోని పొన్నేరి రైల్వే స్టేషన్ లో నిరసన కారణముగా రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది . తమిళనాడు లోని పొన్నేరి రైల్వే స్టేషన్ లో ప్రయాణికులు ఆందోళనకు దిగి రైళ్లను ఆపడం తో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది, నిరసన కారణముగా నెల్లూరు వైపు నుండి చెన్నై వెల్లసిన రైళ్లను అక్కడక్కడా నిలివేయడం తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకు న్నారు. చెన్నై నుండి నెల్లూరు, సూళ్లూరుపేట, గుమిడిపూండి మధ్య నడిచే ఈఎంయూ రైళ్లు ప్రతిరోజూ రావలసిన టైం కు రాకుండా ఆలస్యంగా రావడం పై ఆగ్రహం చెందిన ప్రయాణికులు పొన్నేరి రైల్వే స్టేషన్ లో ఆందోళనకు దిగారు. , రైల్వే అధికారులు వచ్చి రైళ్లను టైమ్ కు నడుపుతామని వ్రాతపూర్వకంగా వ్రాసి ఇస్తేనే ఆందోళన విరమిస్తామని కూర్చున్నారు ఉదయం 8 గంటలనుండి 12 గంటలకు కూడా ఆందోళన కొనసాగింది.

## డోన్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు యూనిఫామ్ పంపిణీ

డోన్ ఆగస్టు 6,( విభారె) డోన్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ లు పంపిణీ చేశారు,స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం రోటరీ క్లబ్ అధ్యక్షులు జింకల కృష్ణా, కార్యదర్శి శేఖర్ యాదవ్ లు నిర్వహించిన ఈ కార్యక్రమనికి డోన్ డి యస్ పి శ్రీనివాస రెడ్డి, ఎం వి ఐ యస్ శివశంకర్,పట్టణ సి ఐ మల్లికార్జున, ముఖ్య అథితులు గా విచ్చేసారు, డోన్ రోటరీ క్లబ్ ఫౌండర్ రాజా విజయ్ కుమార్ జన్మదిన సందర్భంగా 100 మంది ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ లను అందజేసారు,ఈ సందర్భంగా పట్టణ సి ఐ, మల్లికార్జున మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించ్చి,కరోనా పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు, యం వి ఐ శివశంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు, యూనిఫామ్ వేసుకుని, మాస్కు లేనిదే ప్రయాణికులను ఆటోలలో ఎక్కించుకుని వెళ్లరాదని చెప్పారు,అనంతరం రోటరీ క్లబ్ అధ్యక్షులు జింకల కృష్ణ, కార్యదర్శి శేఖర్ యాదవ్ మరియు సబ్యులు పట్టణ సి ఐ మల్లికార్జున ,యం వి ఐ లకు ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులుజగన్మోహన్, డిష్ రఫీ,మాకం కృష్ణకిశోర్, రాజయ్య గౌడ్, శంకర్ గౌడ్, సత్యసైనా రెడ్డి, గంగిరెడ్డి, యన్ నాగరాజు, చంద్ర శేఖర్ రెడ్డి, గౌండా శాలు, లక్ష్మి రెడ్డి, మల్లారెడ్డి, లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు

## డోన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల దినోత్సవం

డోన్ ఆగస్టు 6,( విభారె) డోన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు, స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ నందు శుక్రవారం ఉదయంలయన్స్ క్లబ్ అధ్యక్షుడు అధ్యక్షత వహించారు,ఈ సందర్భంగా ఆగస్టు 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. డోన్ గవర్నమెంట్ హాస్పిటల్ నందు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల గురించి గవర్నమెంట్ హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ బాలచంద్రారెడ్డి గారు తల్లిపాలు ఇవ్వటాన్ని ప్రోత్సహించండి – ఇది మనందరి బాధ్యత అనే నినాదంతో ప్రజలు ముందుకు తీసుకువెళుతున్నట్లు ఆయన చెప్పారు,నవజాత శిశువుకు అవసరమైన పోషకాలను ఇవ్వడానికి తల్లిపాలను ఉత్తమ మార్గము, వ్యాధి మరియు సంక్రమణ నుండి పిల్లలను రక్షించే జీర్ణమయ్యే ప్రోటీన్లను మరియు సహజ రోగనిరోధక శక్తి తో తల్లిపాలు చాలా పోషక మైనవి. తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం అని చెప్పినారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సుంకన్న యాదవ్ లయన్స్ క్లబ్ డోన్ అధ్యక్షులు మాట్లాడుతూ డబ్బా పాలు వద్దు..... తల్లిపాలే ముద్దని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ సుంకన్న తెలిపారు. పిల్లలకు తల్లిపాలు ఇవ్వకుంటే భవిష్యత్తులో పలురకాల ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. సాధారణ మరియు సి సెక్షన్ డెలివరీ రెండింటిలోను డెలివరీ అయిన ఒక గంటలోపు తల్లి తమ బిడ్డకు తప్పకుండా పాలు ఇవ్వాల్సి ఉంటుందని, ఇది తల్లికి మరియు బిడ్డకు ఆరోగ్యకరం అని ఆయన చెప్పారు, శిశువులకు ఆరు నెలల పాటు తల్లిపాలు తప్పకుండా పట్టాలనే వైద్యులు చూచినను చాలామంది పెడచెవిన పెడుతున్నారు అని ఆయన అన్నారు మరియు లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు సలీంద్ర శ్రీనివాసులు యాదవ్ గారు మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ పౌష్టికాహారం తల్లిపాలే, సంపూర్ణ ఆరోగ్యంగా పుట్టిన పిల్లలకు వెంటనే తల్లిపాలు ఇవ్వడం తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యుడు నీలం ప్రభాకర్ యాదవ్ మరియు గవర్నమెంట్ హాస్పిటల్ సిబ్బంది సాధారణ కాన్పు మరియు సి సెక్షన్ డెలివరీ అయినా, మరియు గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

# రైతు ను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం



నంద్యాల ఆగస్టు 6,( విభారె) నంద్యాల పట్టణంలో శుక్రవారం నాడు నంద్యాల పార్లమెంట్ జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సమావేశంను స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల యందు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు శ్రీ కె. హేమసుందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. దీనికి ముఖ్య అతిధిగా రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు శశిభూషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక నిర్ణయాలతో ముందుకెళ్తుందని ఈ రోజు కేంద్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధి

### బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు వంగల శశిభూషణ్ రెడ్డి

కై అనేక సబ్సిడీ లు అందిస్తుంటే ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దానివల్ల రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని విమర్శించారు. అదేవిదంగా జిల్లాలో నకిలీ విత్తనాల దందా అధికారుల మరియు అధికార పార్టీ నాయకుల కనుసన్నలో జరుగుతుందని ఆరోపించారు. మరియు బిజెపి జిల్లా అధ్యక్షులు బుడ్డా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రైతుల పార్టీ అనిచెప్పుకుని రైతు దినోత్సవం చేసే హర్హత వైసీపీ ప్రభుత్వనికి లేదని అన్నారు. జిల్లా వ్యాప్తంగా నిరూన్న వాడుకోలేని దుస్థితి లో ప్రభుత్వం ఉండటం బాధాకరమని అన్నారు. అదేవిదంగా సిద్దేశ్వరం అలుగు వెంటనే నిర్మించి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు సింగం సోమశేఖర్ రెడ్డి, బీజ్జం సుబ్బారెడ్డి, ప్రసాద్ రాజు జిల్లా కిసాన్ మోర్చాఇంచార్జి కొక వెంకటప్ప ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి,కూలేరు రామయ్య జిల్లా ఉపాధ్యక్షులు వడ్డే మహారాజు, శివరామి రెడ్డి, శ్యాంసుందర్ గుప్తా, భాస్కర్ రెడ్డి, రామచద్రుడు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారికి "నవనీత సేవ "



### ఆగస్టు 15వ తేదీ నుండి భక్తులకు అందుబాటులో అగరబత్తీలు టిటిడి సాధికార మండలి సమావేశంలో ముఖ్య నిర్ణయాలు

తిరుమల, మా ప్రతినిధి, ఆగస్టు 06, తిరుమల శ్రీవారి నైవేద్యాల కోసం ప్రతిరోజు అవసరమయ్యే నెయ్యి దేశవాళీ ఆవుల పాల నుంచి తయారుచేయడానికి త్వరలో " నవనీత సేవ " పేరుతో ఓ కొత్త సేవను ప్రారంభించాలని నిర్ణయించినట్లు టిటిడి సాధికార మండలి ఛైర్మన్, ఈవో డాక్టర్ కె.ఎస్. జవహర్‌రెడ్డి తెలిపారు. సాధికార మండలి సమావేశం శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగింది. సమావేశం అనంతరం ఈవో మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.– శ్రీవారి ఆలయంలో నైవేద్యానికి వినియోగించే ప్రసాదాల తయారీకి రోజుకు 30 కిలోల దాకా నెయ్యి అవసరమవుతుంది. ఇందుకోసం సుమారు 1200 లీటర్ల పాలు అవసరమవుతాయి. తిరుమల ఏడు కొండలకు సూచికగా ఏడు దేశవాళీ రకాల ఆవులతోపాటు స్థానికంగా ఉన్న మరో మూడు రకాల దేశవాళీ ఆవులను కలిపి తిరుమలలో 250 నుండి 300 ఆవులను ఉంచి పాల ఉత్పత్తికి ఏర్పాటు చేయాలని నిర్ణయం.– ఈ కార్యక్రమానికి భక్తుల నుంచి దేశవాళీ ఆవుల నుంచి తయారు చేసిన స్వచ్ఛమైన నెయ్యిని విరాళంగా తీసుకుంటాం. భక్తులు వారి శక్తి మేరకు నెయ్యి విరాళంగా ఇవ్వొచ్చు.– శ్రీవారి నైవేద్యానికి స్వచ్ఛమైన నెయ్యి తయారీకి భక్తులు 25 గిర్ గోవులను విరాళంగా అందించారు.– గోసంరక్షణపై చిత్తశుద్ధితో పని చేసే కుటుంబాలకు చెందిన వ్యక్తులను, నిపుణులను గోసంరక్షణ ట్రస్టులో కో–ఆప్షన్ సభ్యులుగా నియమిస్తాం.– టిటిడి అవసరాలకు తగిన విధంగా గోఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రాయలసీమ రైతులతో అనుసంధానం చేసుకుని టిటిడికి ప్రతి ఏటా అవసరమయ్యే ఏడు వేల టన్నుల శనగపప్పు కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలించాలని నిర్ణయం.– తిరుపతి ఎస్వీ పశు వైద్య విశ్వవిద్యాలయం సహకారంతో పశువుల దాణా తయారీ ప్లాంట్, పశువుల సంతాన ఉత్పత్తికి ఆధునిక పిండ మార్పిడి విధానాలకు సంబంధించి ఎంఓయు చేసుకోవాలని నిర్ణయం.– తిరుపతి ఎస్వీ గోశాలలో ఆర్గానిక్ పద్ధతిలో తయారు చేసిన అగరుబత్తీలను ఆగస్టు 15వ తేదీ నుండి తిరుమలలో భక్తులకు అందుబాటులో ఉంచుతాం. అదేవిధంగా కోయంబత్తూరుకు చెందిన ఆశీర్వాద్ సంస్థ ద్వారా 4 నెలల్లోపు పంచగవ్య ఉత్పత్తులైన సబ్బు, షాంపు, ధూప్ స్టిక్స్. ఫ్లోర్ క్లీనర్ లాంటి 15 రకాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువస్తాం. వీటి తయారీకి తిరుపతి డిపిడబ్ల్యు స్టోర్‌లోని భవనాలను ఉపయోగించుకుంటాం.– శ్రీవాణి ట్రస్టుకు ఇప్పటి వరకు రూ.150 కోట్లు విరాళంగా అందింది. శ్రీవాణి ట్రస్టు దాతలకు వీఐపీ బ్రేక్ దర్శనాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయం.–టిటిడి ముద్రణాలయంలో ఏటా రూ.35 కోట్ల నుంచి రూ.40 కోట్ల విలువయ్యే పనులు జరుగుతున్నాయి. పిపిపి విధానంలో అధునాతన యంత్రాలు ఏర్పాటుచేసి అభివృద్ధి చేయడానికి ఆసక్తి కలిగిన వారిని ఆహ్వానించేందుకు విధివిధానాలు ఖరారు చేయాలని నిర్ణయం.– సప్తగిరి మాసపత్రిక ఎడిటోరియల్ బోర్డును ఇటీవల నిష్ణాతులైన పండితులతో ఏర్పాటు చేశాం. త్వరలో మాసపత్రికను పుస్తక రూపంలో సరికొత్త రూపంతో పాఠకులకు అందుబాటులోనికి తీసుకువస్తాం.– తిరుమలలో పర్యావరణ పరిరక్షణ కోసం డీజిల్/పెట్రోల్ వాహనాల స్థానంలో విద్యుత్ వాహనాలను ప్రవేశపెట్టేందుకు నిర్ణయం. తొలిదశలో ప్రయోగాత్మకంగా 35 విద్యుత్ కార్లను ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీస్ లిమిటెడ్(ఇఇఎస్ఎల్) ద్వారా నెలకు రూ.32 వేలు చొప్పున అద్దె చెల్లించి తీసుకోవాలని నిర్ణయం.

## జగన్నాన్న గోరుముద్ద లో ప్లాస్టిక్ బియ్యం కలకలం

### తక్షణమే నివారణ చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు రామాంజనేయులు డిమాండ్



కౌతాళంఆగస్టు 6,( విభారె):వైసీపీ ప్రభుత్వం లో విద్యార్థిని విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకం జగనన్న గోరుముద్ద పథకం కానీ విద్యార్థుల ను మోసం చేసి ప్లాస్టిక్ బియ్యం పంపిణీ చేస్తూన్నారని జనసేన నాయకులు రామాంజనేయులు ఆరోపించారు. శుక్రవారం ఎం ఈ ఓ కలిసి ఫిర్యాదు చేశారు. విద్యార్థుల కు నాణ్యమైన ఆహారాన్ని అందిచాలని,ఆరోగ్యాన్ని పరిరక్షణ చేయాలని పేద విద్యార్థులకు జగన్నాన గోరుముద్ద లబ్ది పొందాలని కోరారు. ఎంఇఓ స్పందించి తగు చర్యలు తీసుకుంటామని పేద విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు బసవరాజు, మురళి రాజు, సుధ, మంగన్న తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటితేనే భావితరాలకు ప్రాణవాయువు

### ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి గారు

గోనెగండ్ల ఆగస్టు 6,( విభారె) ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గోనెగండ్ల మండల పరిధిలోని పుట్టపశం గ్రామంలో ఉపాధి హామీ (ఔఖీఇఊ) శాఖ ఆద్వర్యంలో ఆకుపచ్చని ఆంధ్రావని మన లక్ష్యం – "జగనన్న పచ్చ తోరణం" 72వ వనమహోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మన ప్రియతమ నాయకులు, రైతు బిడ్డ, పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" గారు హాజరయ్యారు. మొదటగా మొక్కలను నాటి నీళ్ళు పోశారు. అందులో భాగంగా మొక్కల సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" గారు మాట్లాడుతూ ప్రస్తుతం కరోనా కారణంగా మానవాళికి ఆక్సిజన్ ఎంత అత్యవసరం అయిందో తెలిసిందన్నారు. రాబోయే రోజుల్లో మొక్కలు పెంచకపోతే భావితరాల మానవాళికి ముప్పు తప్పదన్నారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపునకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న గారు పచ్చతోరణం పథకాన్ని శ్రీకారం చుట్టి పెద్ద ఎత్తున మొక్కలు నాటి పచ్చదనం పెంపునకు కృషి చేస్తున్నారన్నారు. మనం ఆరోగ్యంగా ఉండాలంటే పర్యావరణాన్ని పరి రక్షించు కోవాలని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఓ బోజ్జన్న గారు, ఇసీ ఉస్మాన్ సాబ్ గారు, గ్రామ సర్పంచ్ నరస్మింహా రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ డి. నజీర్ ఆహ్మద్ గారు, బాస్కర్ రెడ్డి, గోవింద్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు సయ్యద్ చాంద్, వడ్డె రంగన్న తదితరులు పాల్గొన్నారు.×

# అందరి గురి సంక్రాంతి



ఒక మామూలు సినిమాకి హిట్ స్థాయి వసూళ్లు తీసుకు రాగలిగేంత సత్తా సంక్రాంతికి ఉంటుంది. ఇక 'బాగుంది' అనే పేరొచ్చిందంటే మాత్రం రికార్డులు నమోదు కావడం ఖాయం. సంక్రాంతి సీజన్ అంటే తెలుగు పరిశ్రమకి అంత మక్కువ. ఎన్ని సినిమాలొచ్చినా చూసేందుకు ప్రేక్షకులు సిద్ధంగా ఉంటారనేది పరిశ్రమ వర్గాల నమ్మకం. పదిహేను రోజులపాటు సాగే ఆ సీజన్‌లో మూడు నాలుగు సినిమాలు సందడి చేస్తుంటాయంటే కారణం అదే. అయితే అగ్ర తారల సినిమాలు మాత్రం రెండుకి మించి విడుదల కావు. అలా విడుదల చేస్తే వసూళ్లకి గండి పడుతుందనే ఓ భయం. రెండు అగ్ర తారల చిత్రాలు...మరో చిన్న సినిమా. వీటికితోడు ఓ అనువాద చిత్రం. ఇప్పటిదాకా ఇదే లెక్కలోనే సంక్రాంతి చిత్రాలు విడుదలవుతూ వచ్చాయి. కానీ వచ్చే పండగకి మాత్రం ఈ లెక్క మరో రకంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.అ గ్ర కథానాయకుల్లో చాలా మంది గురి సంక్రాంతిపైనే పడింది. ఇప్పటికే 'సర్కారు వారి పాట', 'రాధేశ్యామ్'తోపాటు పవన్‌కల్యాణ్ – రానా నటిస్తున్న 'అయ్యప్పనుమ్ కోశియుమ్' రీమేక్.... ఈ మూడూ ముగ్గుల పండక్కి బెర్తులు ఖాయం చేశాయి. మరికొన్ని రేసులో కనిపిస్తున్నాయి. చివరికి పక్కాగా పండగ బరిలో నిలిచే సినిమాలు ఏంటనేది ఆసక్తికరంగా



మారింది. రెండో దశ కరోనా మొదలు కాక ముందు వరకూ 2022 సంక్రాంతి బరిలో రెండు సినిమాలే కనిపించాయి. ఒకటి.. పవన్‌కల్యాణ్ 'హరి హర వీరమల్లు', మరొకటి 'సర్కారు వారి పాట'. కరోనా తర్వాత కొత్త చిత్రాలు తెరపైకొచ్చాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న 'హరి హర వీరమల్లు' స్థానంలో, పవన్‌కల్యాణ్ కొత్త చిత్రం 'అయ్యప్పనుమ్ కోశియుమ్' రీమేక్ జనవరి 12న రానుంది.. మహేష్ 'సర్కారు వారి పాట' ముందు చెప్పినట్టుగానే పండగ కోసమే ముస్తాబవుతుండగా, 'రాధేశ్యామ్' అనూహ్యంగా జనవరి 14న అంటూ విడుదల తేదీని ఖాయం చేసింది. దాంతో సంక్రాంతి బరి మరింత రసవత్తరంగా మారింది. కొన్నేళ్లుగా అగ్ర తారల సినిమాల నిర్మాణ వ్యయం భారీ స్థాయిలో ఉంటోంది. రూ.వందల కోట్ల వ్యయంతో రూపొందుతున్నాయి. 'రాధేశ్యామ్' పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోంది. 'అయ్యప్పనుమ్ కోశియుమ్' రీమేక్ మల్టీస్టారర్ చిత్రం. 'సర్కారు వారి పాట' కూడా భారీ హంగులతో రూపుదిద్దుకొంటోంది. ఇలాంటి మూడు చిత్రాలు ఒకేసారి ప్రేక్షకుల ముందుకొస్తాయంటే బాక్సాఫీసు కళకళలాడటం ఖాయం. కానీ థియేటర్ల సర్దుబాటు ఎలా? అనేదే ప్రశ్న. అగ్ర తారల చిత్రాలు మంచి ప్రారంభ వసూళ్లు సాధించాలంటే సోలోగా విడుదల కావల్సిందే అని, పండగ రోజుల్లో అయితే రెండు సినిమాలైనా ఫర్వాలేదనేది సినీ వ్యాపార వర్గాల మాట. కానీ ఇప్పటివరకు లెక్క ప్రకారం ఇక్కడ ఏకంగా మూడు సినిమాలు ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి.

## ఐదు భాషల్లో విడుదల కానున్న 'పుష్ప'..

హైదరాబాద్ : ఐకాన్ స్టార్ అల్లు అర్జున్.. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ కాంబినేషన్ అంటే చాలు అభిమానులు ఉర్రూతలూగిపోతారు. సుకుమార్, అల్లు అర్జున్, దేవి కాంబినేషన్లో వచ్చిన ఆర్య, ఆర్య 2 పాటలు ఇప్పటికీ మార్మోగుతూనే



ఉంటాయి. ఈ కాంబినేషన్ సక్సెస్ అలాంటిది. పాన్ ఇండియా రేంజ్‌లో రూపొందుతోన్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'పుష్ప' త్వరలో అభిమానులను అలరించనుంది. పదేళ్ల తర్వాత ఈ ముగ్గురి కాంబినేషన్ లో వస్తున్న సినిమా పుష్ప తొలి సింగిల్ ఆగస్టు 13న ఐదు భాషల్లో విడుదల కానుంది. దీనికి సంబంధించిన టీజర్ ను దర్శకనిర్మాతలు విడుదలచేశారు. ఐదు భాషల్లో ఐదుగురు పాడనున్నారు..!ఈ సినిమాలో ఓ పాటను ఐదు భాషల్లో ఐదుగురు లీడింగ్ సింగర్స్ పాడబోతున్నారు.తెలుగులో శివం. హిందీలో విశాల్ దడ్లాని..కన్నడంలోవిజరు ప్రకాష్. నంబియా ర్. తమిళంలోబెన్నీదయాల్..దాక్కోదాక్కో మేక పాటను ఆలపించను న్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో అల్లు అర్జున్ కు జోడీగా రష్మిక మందన నటిస్తున్నారు. దీంతో అభిమానుల్లో అంచనాలు భారీ స్థాయిలో పెరిగిపోయాయి. పుష్ప సినిమా అభిమా నుల అంచనాలను అందుకుంటుందా... అనేది వేచి చూడాలి.

# అదంత ఆషామాషీ కాదు



"ఎ ప్పుడూ ఒకే పంథాలో నడుస్తానంటే కుదరదు. అనుభవం పెరిగే కొద్దీ కొత్త మార్గాలు అన్వేషించాలి. విభిన్నమైన పాత్రలతో నటనలో సరికొత్త కోణాల్ని స్పృశించగలగాలి" అంటోంది రాశీ ఖన్నా. "నాయికగా సుదీర్ఘ కాలం రేసులో నిలవడం అంత ఆషామాషీ వ్యవహారం కాదు. కెరీర్ ఆరంభంలో ప్రతి నాయిక గ్లామర్ పాత్రలతోనో.. నటనా ప్రాధాన్యమున్న పాత్రలతోనో పేరు తెచ్చుకుని ఉండొచ్చు. అయితే ఓ దశ దాటాక కచ్చితంగా విభిన్న దారుల్లో నడిచేందుకు సిద్ధపడాలి. పదే పదే కమర్షియల్ కథల్లోనే నటిస్తామంటే కుదరదు. అలాగే నటనా ప్రాధాన్యమున్న కథాంశాలతోనే ముందుకు సాగుతామన్నా వీలుకాదు. రెండింటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ ముందుకెళ్తేనే సినీ కెరీర్‌ను సుదీర్ఘ కాలం కొనసాగించగలుగుతాం. నటిగా ఓ ఇమేజ్‌లో చిక్కుకుపోకుండా ఉండగలుగుతాం. ఎప్పుడైతే మనపై ఓ ప్రత్యేక ముద్ర ఉండదో.. అప్పుడే కొత్తతరహా కథాంశాలు వెతుక్కుంటూ వస్తాయి" అని చెప్పింది రాశి. ప్రస్తుతం ఆమె తెలుగులో నాగచైతన్యతో 'థ్యాంక్యూ' చిత్రంలో నటిస్తోంది. తమిళంలో 'సర్దార్', 'తుగ్లక్ దర్బార్', 'అరన్‌మనై3' లాంటి చిత్రాలతో పాటు హిందీలో షాహిద్ కపూర్‌తో కలిసి ఓ సినిమా చేస్తోంది.

# సెమీస్‌లో ఓడిన ఇండియన్ రెజ్లర్ భజరంగ్ పూనియా



టోక్యో: ఒలింపిక్స్ (65 కేజీల ఫ్రీస్టైల్ రెజ్లింగ్‌లో ఇండియన్ స్టార్ రెజ్లర్ భజరంగ్ పూనియా ఓడిపోయాడు. శుక్రవారం అజర్‌బైజాన్ రెజ్లర్ హాజి అలియేవ్‌తో జరిగిన సెమీస్ బౌట్‌లో అతడు 5–12 తేడాతో పరాజయం పాలయ్యాడు. అంతకుముందు జరిగిన రెండు బౌట్లలోనూ గెలిచి గోల్డ్‌పై ఆశలు రేపిన భజరంగ్.. ఇప్పుడు బ్రాంజ్ మెడల్ కోసం శనివారం తలపడనున్నాడు. రియో గేమ్స్‌లో బ్రాంజ్ మెడల్ గెలిచిన ప్రత్యర్థి హాజి ముందు భజరంగ్ నిలవలేకపోయాడు.తొలి పీరియడ్‌లోనే 4–1 లీడ్‌లోకి దూసుకెళ్లిన అలియెవ్.. రెండో పీరియడ్‌లో మరింత చెలరేగిపోయాడు. ఈ పీరియడ్‌లో భజరంగ్ 4 పాయింట్లు సాధించి పుంజుకోవాలని చూసినా.. అలియెవ్ ఏకంగా 8 పాయింట్లతో సులువుగా గెలిచాడు. ఈ ఓటమితో శనివారం రష్యన్ ఒలింపిక్ కమిటీకి చెందిన రషిదోవ్‌తో బ్రాంజ్ మెడల్ కోసం భజరంగ్ తలపడనున్నాడు.

### చెదిరిన కల.. దుఃఖం ఆపుకోలేకపోయిన అమ్మాయిలు..

టోక్యో: ఒలింపిక్స్‌లో భారత హాకీ అమ్మాయిలు అద్భుతంగా పోరాడారు. అసలు ఆశలే లేని స్థితి నుంచి ఏకంగా బ్రాంజ్ మెడల్ ఆడే స్థాయికి చేరారు. మెడల్ మ్యాచ్‌లోనూ బ్రిటన్‌పై చాలా వరకూ పైచేయి సాధించింది. ఒక దశలో 0–2 గోల్స్‌తో వెనుకబడినా.. తర్వాత 3–2 లీడ్‌లోకి దూసుకెళ్లి మెడల్ సాధించేలానే కనిపించారు. కానీ చివరి క్వార్టర్‌లోతడబడి తృటిలో మెడల్ చేజార్చుకున్నారు. తమ కల చెదరడంతో ఈ ఓటమిని వాళ్లు జీర్ణించుకోలేకపోయారు. దుఃఖాన్ని ఆపుకోలేక గ్రౌండ్‌లోనే బోరున ఏడ్చేశారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190